


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 35 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం 28 అక్టోబర్ 2025 పేజీలు : 12 వెల : 2/-



## మా ఆదేశాలపై ఇంత నిర్లక్ష్యమా?

- కుక్కలకు ఇంజక్షన్లు వేయించాలన్నాం
- ఆగస్టు 22న ఉత్తర్వులిచ్చాం
- అధికారులు పేపర్లు చదవడం లేదా?
- 3వ తేదీన మా ముందుకు రండి
- రాష్ట్రాల సీఎస్‌లకు సుప్రీంకోర్టు ఆదేశం

7



## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

- సీజేఐ జస్టిస్ గవాయ్ సిఫారసు
- వచ్చే నెల 23న గవాయ్ రిటైర్మెంట్
- 24న జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం!

7



### ప్రధాని మోదీపై హత్యకు కుట్ర?

## పుతిన్ రక్షించాడా?

- చైనాలో ప్రధాని మోదీపై హత్యాయత్నానికి కుట్ర జరిగిందంటూ కథనం
- ఈ కుట్రను భారత్, రష్యా నిఘా వర్గాలు భగ్నం చేశాయని వెల్లడి
- కుట్ర వెనుక అమెరికా హస్తం ఉన్నట్టు అనుమానాలు
- మోదీని తన కారులో ఎక్కించుకుని పుతిన్ హెచ్చరించినట్టు ప్రచారం

# మొంథా ముప్పు!



కాకినాడకు చేరువలో తుపాను..
కోస్తాకు గండం..

- ఏపీపై పెను ప్రభావం.. తెలంగాణలోనూ భారీ వర్షాలు
- ఏపీలో 17 జిల్లాల్లో రెడ్ అలర్ట్, తెలంగాణలో 8 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్
- ఏపీలో తీరం అల్లకల్లోలం... విశాఖలో భారీ ఈదురు గాలులు, ఎడతెగని వర్షం
- హైదరాబాద్, విజయవాడ, విశాఖ, తిరుపతికి పలు విమానాలు రద్దు
- 30కిపైగా విమానాలు, 97 రైలు సర్వీసుల రద్దు
- కాకినాడ- అమలాపురం మధ్య బుధవారం
- తెల్లవారుజామున తుపాను తీరాన్ని దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 110 కి.మీ. ప్రచండ వేగంతో గాలులు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
ఉగ్రరూపం దాల్చుతూ.. సాగరాన్ని చీల్చుకుంటూ.. విరుచుకుపడేందుకు మొంథా తుపాను పెను ఉప్పెనలా దూసుకొస్తోంది. ఓవైపు బలమైన ఈదురు గాలులు కకావికలం చేస్తుండగా.. జడివానలు జడిపిస్తున్నాయి. రోడ్డు మార్గాలు జలమయమయ్యాయి.. రైలు మార్గాలను ముంపు ముప్పు భయపెడుతోంది. భీకర గాలులు వాయుమార్గాన్ని సైతం స్తంభింపజేస్తున్నాయి. ఏపీతోపాటు తెలంగాణ, ఒడిశా, తమిళనాడులో మొంథా ప్రభావం చూపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 97 రైలు సర్వీసులు రద్దు కాగా, 30కిపైగా విమాన సర్వీసులు ఆగిపోయాయి. సముద్రం అల్ల కల్లోలం కావడంతో జల రవాణా స్తంభించిపోయింది. మొంథా తుఫాను ప్రభావం తెలంగాణపైనా ఉన్నట్లు వాతావరణ శాఖ చెప్పింది. రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లోని కొన్నిచోట్ల - మిగతా 2లో

## ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం

- తుఫాన్‌పై ఎన్ని రివ్యూలు చేశారనేది కాదు..
- క్షేత్రస్థాయిలో ప్రభావం ఎంతనేదే ముఖ్యం
- రియల్ టైంలో ప్రజలకు సమాచారం అందాలి
- ప్రతి గంటకూ తుఫాన్‌పై బులెటిన్లు: సీఎం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
మొంథా తుఫాన్‌పై ఆందోళన వద్దని, అప్రమత్తంగా ఉందామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం రాత్రి 10గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో తుఫాన్ ప్రభావంపై వాతావరణ శాఖ అధికారులతో ఆయన సమీక్ష చేశారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంపై మంగళవారం నుంచి అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలపగా.. దీనిపై రియల్‌టైమ్‌లో ప్రజలకు సమాచారం అందించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వ సన్నాహాలు, సేవలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తుఫాన్ - మిగతా 2లో



7

## 12 రాష్ట్రాలు, యూటీల్లో 'సర్'

- నవంబర్ 4 నుంచి ఓటర్ల జాబితా రెండో విడత సమగ్ర సవరణ
- డిసెంబర్ 8న ముసాయిదా జాబితా.. ఫిబ్రవరి 7న తుది జాబితా ప్రచురణ
- 4 రాష్ట్రాల్లో వచ్చే ఏడాదే ఎన్నికలు.. అస్సాంలో విడిగా 'సర్' నిర్వహణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రకటన.. ఇక 12 రాష్ట్రాల్లో ఓట్ చోరీ: విపక్షాలు

## ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో ఉండాలి

- 'ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి
- అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడండి
- కాకినాడ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సాయం అందించాలి
- మంత్రి నారా లోకేశ్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
తుపాన్ ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. 'ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడండి. కాకినాడ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన - మిగతా 2లో

## రైల్వే వ్యవస్థ అప్రమత్తం



- ముందస్తు భద్రత చర్యలు చేపట్టాం
- దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ వెల్లడి
- రైల్వే లైన్ల వెంట 24 గంటలు పెట్రోలింగ్
- ముఖ్యమైన స్టేషన్లలో హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
మొంథా తుపాను నేపథ్యంలో రైల్వేశాఖ ముందస్తు భద్రత చర్యలు చేపట్టిందని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సోమవారం విజయవాడకు చేరుకుని డీఆర్ఎం మోహిత్ సోనాకియా, కోఆర్డినేషన్ అండ్ సెక్యూరిటీ డీజీఎం శ్రీనివాస మల్లాది, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ కె.పద్మజ, పలు బ్రాంచ్‌ల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా - మిగతా 2లో



### ప్రాణనష్టం వాటిల్లకుండా

## చర్యలు చేపట్టాలి

గర్భిణులు, బాలింతలు, వృద్ధుల సంరక్షణ కీలకం
ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
తుపాను కారణంగా ప్రాణనష్టం సంభవించకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలని, ముఖ్యంగా - మిగతా 2లో

# ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం

-మొదటిపేజీ తరువాయి

సన్నద్ధతపై ఐవీఆర్ఎస్ విధానంలో సేకరించిన సమాచారంపైనా సీఎం సమీక్ష చేశారు. అంతకుముందు... ఇదే అంశంపై ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రతి గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేయాలని ఆదేశించారు. తుఫాన్ రక్షణ చర్యల విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుందని, ఆ సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలని చంద్రబాబు కోరారు. ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలు పంపి, అవగాహన పెంచాలని, తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్ల అనుభవాన్ని వినియోగించాలని సీఎం సూచించారు. 'రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్ఠం చేయాలి. చెరువులు, కాలువ గట్లు తెగిపోకుండా చూసుకోవాలి. సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా, శాటిలైట్ ఫోన్లు వినియోగించాలి. ప్రత్యేకంగా మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలి. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జనరేటర్లను బ్యాకప్ కోసం వినియోగించాలి. తుఫాన్ వల్ల ఎవ్వరూ ప్రమాదాల బారిన పడకూడదు.

ఒక్క మరణం కూడా సంభవించకూడదు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి" అని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి, జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి లోకేష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తుఫాన్ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం సీఎం ఆదేశాలు**



'మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలి' అని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. మొంథా తుఫాన్‌పై కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి ప్రాంతాల్లో కొండచరియలు జారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జి అధికారుల ను నియమించాలి. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. వలంటరీగా వచ్చే వారిని సహాయ కార్యక్రమాలకు వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశించారు.

**చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్**

మంత్రి లోకేశ్‌కు పీఎంవోతో సమన్వయ బాధ్యతలు

మొంథా ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రధాని నరేంద్రమోదీ తనకు ఫోన్ చేసి, అడిగి తెలుసుకున్నారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంవోతో సమన్వయం బాధ్యతను మంత్రి లోకేశ్‌కు సీఎం అప్పగించారు.

**సన్నద్ధతపై 83శాతం సంతృప్తి : అధికారులు**

అధికారులు ఎన్ని రివ్యూలు చేశారనేది కాదని, క్షేత్రస్థాయిలో ఎంత మేర ప్రభావం చూపిందనేది ముఖ్యమని, దీనికి ప్రజాభిప్రాయాన్ని ప్రాతిపాదకగా తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తుఫాన్‌పై ప్రభుత్వ సన్నద్ధత ఎలా ఉందనే అంశంపై సేకరించిన ప్రజాభిప్రాయంలో 83న సంతృప్తి వ్యక్తమైందని అధికారులు వివరించారు. తుఫాన్‌కు సంబంధించి జాగ్రత్తలపై మీమీ ప్రాంతాల్లో సమావేశాలు జరిగాయా అన్న ప్రశ్నకు 70శాతం మంది అవును.. అని సమాధానమిచ్చారని తెలిపారు. ముందు జాగ్రత్తలపై 74శాతం మంది సంతృప్తిగా ఉన్నారని అధికారులు వివరించారు. ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తొలిసారిగా ఈ సిస్టంను ఏర్పాటు చేశామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమాచారం ఆధారంగా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి నేరుగా ఆయా ప్రాంతాలకు మైక్‌ల ద్వారా అప్రమత్తం చేసే అవకాశం ఉందని తెలిపారు.

# మొంథా ముప్పు!

-మొదటిపేజీ తరువాయి

భారీ నుంచి అతిభారీ, అత్యంత భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని హెచ్చరించింది. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదు కావొచ్చని వివరించింది. తీవ్ర తుపాను కారణంగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈమేరకు జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది.

**ఏపీలో 17 జిల్లాల్లో రెడ్ అలెర్ట్..**

ఏపీలో నేడు, రేపు 17 జిల్లాల్లో (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం) అత్యంత భారీ వర్షాలు పడే అవకాశాలుండటంతో రెడ్ అలర్ట్ జారీ చేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప, నంద్యాల జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీచేయగా, చిత్తూరు, కర్నూలు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ఎల్లో అలెర్ట్ జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఏపీలో హైఅలర్ట్ ప్రకటించారు. పలు జిల్లాల్లో నాలుగు రోజులపాటు అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. ఉద్యోగులకు మూడు రోజుల పాటు సెలవులు రద్దు చేసి సహాయక చర్యల్లో నిమగ్నం చేశారు.

**కాకినాడ తీరంలో రాకాసి అలల హోరు..**

తీరం వైపు దూసుకొస్తున్న మొంథా తుపాను ధాటికి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. విశాఖ జిల్లా తడిసి ముద్దవగా కాకినాడ తీరంలో రాకాసి అలలు విరుచుకుపడుతున్నాయి. తీవ్ర వాయుగుండం నుంచి సోమవారం ఉదయానికి తుపానుగా మారింది. ఆగ్నేయ, పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తుపాను గంటకు 13 నుంచి 18 కిలోమీటర్ల వేగంతో ఉత్తర, వాయవ్య దిశగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

రాత్రి సమయానికి విశాఖకు 530 కిలోమీటర్లు, కాకినాడకు 490, చెన్నైకి 440 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. మంగళవారం ఉదయానికి ఇది తీవ్ర తుపానుగా మారి ముందుకు కదలనుంది. బుధవారం తెల్లవారు జామున కాకినాడ%–% అమలాపురం మధ్యలో తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. తుపాను తీరాన్ని సమీపిస్తున్న కొద్దీ వేగం పెరుగుతోంది. తుపాను తీరాన్ని దాటే సమయంలో గంటకు 90 నుంచి వంద కిలోమీటర్లు, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు.



**విశాఖ జిల్లాలో ఎడతెగని వర్షం..**

మొంథా తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర అంతటా ఎడతెగని వర్షాలు కురవగా మిగిలిన చోట్ల ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. విశాఖ నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో పలుచోట్ల చెట్లు విరిగి రోడ్డుపై కూలిపోయాయి. విశాఖ రూరల్ పరిధిలోని జాతర ప్రాంగణం వద్ద 9.2 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. మధురవాడ, కాపులుప్పాడ, పెందుర్తి, సీతమ్మధార, ఎండాడ, సాగర్ నగర్, మహారాణిపేట, గోపాలపట్నం, గాజువాక, సబ్బవరం ప్రాంతాల్లో 6 నుంచి 8 సెం.మీ. వర్షపాతం రికార్డయింది. అనకాపల్లి జిల్లా గంధవరంలో 5.8, శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం విజయరాంపురంలో 5.7 సెంటీమీటర్ల వర్షం పడింది. అంబేద్కర్ కోనసీమ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అన్నమయ్య జిల్లాల్లోనూ పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ సముద్ర తీరంలో రెండు మీటర్లపైగా ఎత్తులో అలలు ఎగిసిపడుతున్నాయి. పెను తుపాను గండం కోనసీమను వణికిస్తోంది. సముద్రం ముందుకు చొచ్చుకు రావడంతో రాకాసి అలలు రెండు మూడు మీటర్ల ఎత్తున ఎగసిపడుతున్నాయి.

**నేడు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు..**

తుపాను ప్రభావంతో మంగళవారం ప్రకాశం, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు (20 సెంటీమీటర్లకుపైగా), కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు (15 నుంచి 20 సెంటీమీటర్లు) కురిసే అవకాశం ఉంది. తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు, నెల్లూరు, నంద్యాల, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

**రేపు కూడా కుండపోతే..!**

ఈనెల 29వ తేదీన బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరంలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నంద్యాల, ప్రకాశం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇప్పటికే 32,400 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఏపీలో 233 మండలాల్లోని 1,419 గ్రామాలు, 44 మున్సిపాలిటీల్లో తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**విమానాల రద్దు**

మొంథా తుపాను ప్రభావంలో విజయవాడ, విశాఖపట్నం నుంచి హైదరాబాద్, తిరుపతితోపాటు దేశంలోని వివిధ గమ్యస్థానాలకు రాకపోకలు సాగించే విమానాలను కొన్ని ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇప్పటికే రద్దు చేశాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో 30కి పైగా విమానాల రాకపోకలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉందని ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. అలాగే, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మంగళవారం, బుధవారం ప్రయాణించాల్సిన 54 రైళ్లను రద్దు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో 43 రైళ్లను రద్దు చేశారు. మొత్తం 97 రైళ్లను రద్దు చేసినట్లు ఆయా డివిజన్ల అధికారులు ప్రకటించారు.

విజయవాడ డివిజన్ పరిధిలోని విజయవాడ, భీమవరం, నిడదవోలు, గుంటూరు, కాకినాడ, తెనాలి, రేపల్లె, మార్కాపురం, మచిలీపట్నం, నరసాపూర్, ఒంగోలు, రాజమహేంద్రవరం నుంచి బయలుదేరే రైళ్లను రద్దు చేసినట్లు డివిజనల్ అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు ఎంఎస్ఎస్ ద్వారా సమాచారం పంపామని, టికెట్ల డబ్బును వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. కాగా, కాకినాడ, మచిలీపట్నం పోర్టుల్లో లోకల్ వార్నింగ్ సిగ్నల్%–%4 ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

**తమిళనాడు, ఒడిశాలో..**

తమిళనాడు, ఒడిశాలోనూ మొంథా ప్రభావం చూపుతోంది. చెన్నైతోపాటు ఉత్తర తమిళనాడులోని నాలుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసనట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. మొంథా నేపథ్యంలో ఒడిశా కూడా అప్రమత్తమైంది. దక్షిణ ఒడిశాలో 8 జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీచేశారు. మూడువేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**8 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్**

తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, నిర్మల్, మహబూబాబాద్... భద్రాద్రి కొత్తగూడెం,ఈ జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ, అత్యంత భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో ఉండాలి

-మొదటిపేజీ తరువాయి



సాయం అందించాలి. కూటమి పార్టీల కేడర్ సహాయక చర్యల్లో పాల్గొనాలి. తుపాను ప్రభావిత తీర ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజల కోసం ముందస్తుగా సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి ఆహారం, నీరు సిద్ధంగా ఉంచాలి. వర్షాల తర్వాత అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలి. అంబులెన్స్‌లు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా ఆ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలి. కమ్యూనికేషన్ సమస్యలు తలెత్తకుండా సెల్‌ఫోన్ ఆపరేటర్లు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి. పంట పొలాల్లో నీరు నిలిస్తే, వెంటనే తొలగించేందుకు ఆయిల్ మోటార్లు సిద్ధంగా ఉంచుకోవాలి' అని లోకేశ్ సూచించారు.

**జలవనరులశాఖ అధికారులు**

**అప్రమత్తం కావాలి: మంత్రి నిమ్మల**

'తుపాను ప్రభావిత జిల్లాల్లో జలవనరులశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. సీఈ స్థాయి నుంచి లస్కర్ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. అందరూ వారి ప్రధాన కేంద్రంలో అందుబాటులో ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలి. సెలవుల్లో ఉన్నవారు వెంటనే రద్దు చేసుకుని విధుల్లో చేరాలి' అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం సాయంత్రం జలవనరులశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి మాట్లాడారు. చెరువులు, కాల్వగట్లు తెగిపోతే తక్షణం మరమ్మతులు చేపట్టాలన్నారు. జలాశయాల నుంచి నీటిని దిగువకు విడుదల చేసే ముందు ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని బుడమేరు డైవర్షన్ ఛానల్‌పై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. విజయవాడ నగరంలో వెలగలేరు రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు అండర్ టన్నెల్ వరకు పాత బుడమేరు ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఎర్రకాలువ, యనమదుర్రు డ్రెయిన్, బురద కాలువ, సుద్దవాగు, ఏలేరు రిజర్వాయర్, రైవాడ కాలువలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.

## రైల్వే వ్యవస్థ అప్రమత్తం




-మొదటిపేజీ తరువాయి

వ్యూహాత్మకంగా ప్రణాళికలను మార్చుకుని అధికారులు, సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని జీఎం సూచించారు. డీఆర్ఎం మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో ప్రయాణికులు, సిబ్బంది, రైల్వే ఆస్తుల భద్రత కోసం ఆపరేటింగ్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్, మెకానికల్, కమర్షియల్, మెడికల్ విభాగాలను హై అలర్ట్‌లో ఉంచామని చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలు, రైలు పట్టాలు, వంతెనల పరిస్థితులు, కాలువలు, నదుల్లో నీటి ప్రవాహాన్ని 24 గంటలు పర్యవేక్షించేందుకు పెట్రోలింగ్ బృందాలు, కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే ప్రత్యామ్నాయంగా డీజిల్ ఇంజిన్లు, మొబైల్ రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచామని వివరించారు.

**హెల్ప్‌డెస్క్ ల ఏర్పాటు**

ప్రయాణికులు రైళ్ల సమాచారం తెలుసుకునేందుకు విజయవాడతోపాటు రాజమండ్రి, కాకినాడ, భీమవరం, తెనాలి తదితర ముఖ్య స్టేషన్లలో 24 గంటలు సేవలు అందించేలా హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని డీఆర్ఎం తెలిపారు. రద్దయిన రైళ్లకు చెందిన, ప్రయాణాలను రద్దు చేసుకున్న ప్రయాణికుల కోసం రిఫండ్ కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ(ఏపీఎస్‌డీఎంఏ)ని సమన్వయం చేసుకుంటూ రైల్వేశాఖ నిరంతరం కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకుంటోందని వివరించారు.

**97 రైళ్ల రద్దు**

తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మంగళవారం, బుధవారం ప్రయాణించాల్సిన 54 రైళ్లను రద్దు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో 43 రైళ్లను రద్దు చేశారు. మొత్తం 97 రైళ్లను రద్దు చేసినట్లు ఆయా డివిజన్ల అధికారులు ప్రకటించారు. విజయవాడ డివిజన్ పరిధిలోని విజయవాడ, భీమవరం, నిడదవోలు, గుంటూరు, కాకినాడ, తెనాలి, రేపల్లె, మార్కాపురం, మచిలీపట్నం, నరసాపూర్, ఒంగోలు, రాజమహేంద్రవరం నుంచి బయలుదేరే రైళ్లను రద్దు చేసినట్లు డివిజనల్ అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు ఎంఎస్ఎస్ ద్వారా సమాచారం పంపామని, టికెట్ల డబ్బును వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

**పలు ఆర్టీసీ సర్వీసులు రద్దు**

సాక్షి, అమరావతి: తుపాను హెచ్చరికల వల్ల పలు బస్ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. తుపాను నేపథ్యంలో ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సోమవారం ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్టీసీ చేపట్టాల్సిన ముందస్తు చర్యలను నిర్దేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బస్సుల రాత్రి హాల్ట్‌ను రద్దు చేసింది. సోమవారం రాత్రి 9గంటల నుంచి తుపాను ప్రభావం తగ్గేంతవరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రయాణికులకు సమాచారం అందించేందుకు కమ్యూనికేషన్ సెల్‌లను ఏర్పాటు చేసింది. అత్యవసర సేవల కోసం ప్రతి డిపోలో కనీసం 10 మంది డ్రైవర్లు, 10 మంది కండక్టర్లను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది.

## ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలి


-మొదటిపేజీ తరువాయి

గర్భిణులు, బాలింతలు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని సూచించారు. అంబులెన్స్‌లు, ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్య పెంచాలన్నారు. కాకినాడ జిల్లాకు కేటాయించిన రూ.కోటి నిధులను అత్యవసరాలకు ఖర్చు చేయాలని అన్నారు. తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ, కలెక్టర్, ఎస్పీ, జిల్లా యంత్రాంగంతో ఉప ముఖ్యమంత్రి పవన్ తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**అత్యవసరాలు అందుబాటులో ఉండాలి**

'కాకినాడ జిల్లాలోని 260 పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలి. లోతట్టు ప్రాంతాలు, వాగుల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలి. అత్యవసర పరిస్థితుల్లో శాటిలైట్ ఫోన్లు వినియోగించుకోవాలి. పునరావాస కేంద్రాల్లో సరైన భద్రత కల్పించాలి. దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు బిగించాలి' అని పవన్ సూచించారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...





# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ ప్రశాంత్ కుమార్



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్** : మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ ప్రశాంత్ కుమార్ సూచించారు. 27, 28, 29 తేదీలలో తుఫాన్ తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉందనీ, గంటకు 80 నుండి 100 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలనీ అన్నారు. తీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు పునరావాస కేంద్రాలకు తరలివెళ్ళాలని, సముద్రంలోకి వేటకు ఎవరు వెళ్లరాదన్నారు సూచించారు.కొమరగిరిపట్నం నక్కారామేశ్వరం, సీతారామాపురం, వాసాల తిప్ప గ్రామాలలో సిఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై సంపత్ కుమార్ పర్యటించి తీర ప్రాంత ప్రజలకు పలు సూచనలు తెలియజేశారు. వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. సిఐ వెంట అల్లవరం ఎస్సై సంపత్ కుమార్,రెవెన్యూ అధికారులు తదితరులు పరిస్థితి గమనించి ప్రజలకు తగు సూచనలు చేసారు.

# మొంథా తుఫాన్‌పై అవగాహన కల్పించిన మున్సిపల్ సిబ్బంది





**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : మండపేట మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు ఇంటింటికి వెళ్లి తుఫాను ముందస్తు చర్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మొంథా తుఫాన్ కాకినాడకు 680 కి.మీ దూరంలో కేంద్రీకృతం అయి ఉందని ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలన్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. 24 గంటలు హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కమిషనర్ టీవీ రంగారావు సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జెసిబి లు ట్రాక్టర్లు పనివారిని మంచినీటి ట్యాంకర్లను సిద్ధం చేసి ఎటువంటి క్లిష్ట పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు పురపాలక సంఘ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు కమిషనర్ తెలియజేశారు. ఆలమూరు రోడ్డు, దిబ్బగరువు రోడ్డు, మారేడుబాక రోడ్డు తదితర వర్షపు నీటి కాలవలలో అడ్డు తొలగించి ముందస్తు చర్యలు తీసుకున్నారు. నివాసం ఉండే ప్రజలకు ప్రత్యేకంగా షెల్టర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. మెప్మా సిబ్బంది అనేక ప్రాంతాలలో తిరిగి అవగాహన కల్పించారు. వర్షాన్ని లెక్కచేయకుండా తుఫాను ముందస్తు చర్యలు పై ప్రచారం నిర్వహించారు. మైకు ఏర్పాటు చేసి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా తుఫాను జాగ్రత్తల గురించి ప్రచారం చేసినట్లు కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ తుఫాను పై భయాందోళనలు చెందొద్దని పట్టణ ప్రజలను కోరారు .అన్ని రకాలుగా సహాయక చర్యలు అందించేందుకు మున్సిపల్ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇతర సమస్యల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఫిర్యాదులు చేసేవారు హెల్ప్ లైన్ నెంబర్ 9849906527 కు సంప్రదించాలని కోరారు.

### తుఫాన్‌పై గ్రామంలో ప్రచారం చేస్తున్న

# స్కూల్ టీచర్ ఆలేటి దుర్గాప్రసాద్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ఆవిడి మోడల్ ప్రైమరీ స్కూల్ టీచర్ ఆలేటి దుర్గాప్రసాద్ తుఫాన్ పైగ్రామంలో ప్రచారం తుఫాన్ సందర్భంగా స్కూళ్లకు సెలవు ఇవ్వడంతో ఇంటివద్ద ఉండవలసిన ఆ ఉపాధ్యాయుడు పాఠశాల కోసం ప్రచారం చేసిన విధంగానే తుఫానుపై ప్రజలను మైక్ ద్వారా అప్రమత్తం చేస్తూ అందర్నీ ఆకర్షిస్తున్నాడు తన పాఠశాల విద్యార్థులే కాక ఊర్లో వారంతా బాగుండాలనే మాస్టారు సంకల్పం అందరికీ ఆదర్శనీయంగా మారింది ఏదో సెలవు ఇచ్చారు ఇంట్లో కూర్చుంటే సరిపోతుంది అనుకోకుండా తుఫాను అప్రమత్త విషయంలో ప్రభుత్వానికి తన వంతు చేదుడు వాదోడుగా తాను పనిచేసే ఊర్లో ప్రచారాన్ని చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు ఇటీవలే ఆ మాస్టారు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యలో చేసిన సేవలు గాను ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అందుకున్నారు.

### సాయి మార్షల్ ఆర్ట్స్ అకాడమిలో

# విల్లువిద్యతో పతకాల సాధన





**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్** : డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నుండి సాయి మార్షల్ ఆర్ట్స్ స్టూడెంట్స్ విల్లు విద్యలో ఏడుగురు విద్యార్థులు పాలొగొన్నగా వీరిలో ఐదుగురుకి ఆర్చరీలో తృతీయ స్థానంలో నిలిచారు. వీరు ఈ నెల 26న పిఠాపురంలో ఉన్న ఆర్ఆర్బీస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు ఆదివారం జరిగాయి. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రౌండ్ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విభాగంలో 150 మంది తలపడ్డారు. సాయి మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ దేశంశెట్టి సాయిబాబు, డాక్టర్ బి. ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా ఆర్చరీ కోచ్ మాట్లాడుతూ ఎస్. జె. అంజని, డి. ఎస్. ఎస్. ఎస్.హర్షిత, జి తనిష్ నాయుడు, పి.వైష్ణవి, ఎ.హర్ష మణికంఠ విద్యార్థులు మూడోవ స్థానం కెవసం చేసుకున్నారు అని తెలియ చేసారు.ఆర్చరీ ఓవరాల్ ఛాంపియన్గా మొదటిస్థానంలో పిఠాపురం, ద్వితీయ స్థానంలో రాజమహేంద్రవరం, తృతీయ స్థానంలో కాకినాడ క్రీడాకా రులు బహుమతి గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు 36 మంది ఎంపిక య్యారు. పోటీలను మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రారంభించారు. ఏపీ ఇంటర్మీడియట్ నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.సురేష్కుమార్, కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు, ఆర్చరీ సంఘ సభ్యులు కె.పద్మనాభం, కె.చిన్నబ్బాయి బహుమతులు అందజేశారు. ఎంపికైన వారు వచ్చే నెల ఒకటి నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

### సముద్ర తీర ప్రాంత వాసులతో

# సమావేశమైన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్** : మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సముద్ర తీరం ప్రాంత వాసులతో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి సమావేశమయ్యారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గచ్చకాయలపొర, సిర్ర యానాం, నీళ్ళరేవు, పల్లం, పల్లంకుర్రు, బలుసుతిప్ప తదితర గ్రామాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసి తుఫాన్ హెచ్చరికల పై తగు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని గ్రామస్తులకు వివరించారు.అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 441 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తగు మందులు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేసిందన్నారు. అలాగే ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### కర్నూలు బస్ దుర్ఘటనను

# వైసీపీ రాజకీయం చేస్తోంది

### ముత్యాల బాబ్జి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే బస్సుకు మార్గ మధ్యంలో కర్నూల్ దగ్గరలో ప్రమాదం జరిగింది అది ఏపీ ప్రభుత్వం బాధ్యతని వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. ప్రమాదం జరిగిన బస్సుకి అనుమతులు లభించింది ఒరిస్సా రాష్ట్రంలో బయలుదేరింది తెలంగాణ రాష్ట్రంలో గమ్యం చేరవలసింది కర్ణాటక రాష్ట్రం దురదృష్టం బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా 19 మంది ప్రాణాలు కోల్పోయారు ఆ సంఘటనలో మన ప్రాంతానికి చెందిన రావులపాలెం వాసి కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి మృతి చెందడం దిగ్భ్రాంతికి గురి చేసింది బాధిత కుటుంబానికి తగు విధంగా న్యాయం జరగాలని కోరుకుంటున్నాము. ప్రమాద సంఘటనలో బాధిత కుటుంబానికి పరామర్శ పేరుతో సానుభూతి చూపి తదుపరి వైసిపి నేతలు ప్రభుత్వంపై బురదలుతున్నారు.ఇది ప్రభుత్వ హత్య అనడం ఈ ప్రమాద ఘటనలో చనిపోయిన వారికి ఐదు లక్షలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు అనడం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనంఇటువంటి ప్రమాదాలు మరల జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన పనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు జరిపి 289 బస్సులపై అధికారులు కేసులు నమోదు చశారు. అగ్నిమాపక పరికరాలు లేని బస్సులును,రవాణా చట్టాన్ని లెక్కచేయకుండా తిరుగుతున్న బస్సులును, అత్యవసర ద్వారం లేని బస్సులును, అసలు సరైన పత్రాలు లేని బస్సులును గుర్తించి వాటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ప్రతి ఆరు నెలలకి ఒకసారి రోడ్డు భద్రత సమావేశాలు జరపాలని కోరుతున్నాం అని ముత్యాల బాబ్జి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి తెలియజేశారు.

### తూఫాన్ పట్ల ప్రజలు

# అత్యంత అప్రమత్తంగా ఉండాలి

### ఆంధ్రప్రదేశ్ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి అతి తీవ్ర తుపానుగా మారింది. ఈ తుపాను రేపు (మంగళవారం) రాత్రికి కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కోస్తాంధ్ర ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి పిలుపునిచ్చారు. నేడు మరియు రేపు కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులు వీస్తాయని ఆమె తెలిపారు.ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే సురక్షిత శిబిరాలకు తరలిపోవాలి.నీరు, ఆహారం, మందులు వంటి అత్యవసర వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలి. నేడు, రేపు అనవసర ప్రయాణాలు పూర్తిగా మానుకోవాలి.విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలి.ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించి, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్యులు నారా లోకేష్ ఎప్పటికప్పుడు అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తూ,అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని ఆమె వెల్లడించారు.

# తుఫాను పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి


### ముందస్తు చర్యలపై ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : ఆస్తి, ప్రాణ నష్టాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన రెవెన్యూ, పిఆర్, పోలీస్, ఎలక్ట్రికల్ అధికారులతో కాన్ఫరెన్స్ కాల్‌లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మొంథా తుఫాన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీరం దాటనున్న నేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ,పి ఆర్,పోలీస్,ఎలక్ట్రికల్ మరియు ఉన్నతాధికారులతో కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడారు. తుఫాను తీరం దాటే సమయంలో, దాటిన తర్వాత అత్యంత వేగంగా గాలులు వీయనున్నాయని, వర్షపాతం అత్యధికంగా నమోదు కానున్నందున ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నియోజకవర్గ ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ బయటకు రాకుండా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, గుడిసెలు, పాత శిధిల భవనాల్లో ఉన్న ప్రజలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని మరియు పునరావాస కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రతి రెండు గంటలకు ఒకసారి తుఫాన్ పరిస్థితి తెలుసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు.ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురుకాకుండా తగిన జాగ్రత్తల తీసుకోవాలన్నారు. ఎటువంటి ప్రాణ,ఆస్తి నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న రెండు రోజులు అత్యంత కీలకమైనవని సమిష్టి కృషితో తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొని విపత్తు నుంచి ప్రజలను రక్షిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# తుఫాన్ ఎదుర్కొనేందుకు అప్రమత్తమైన విద్యుత్ శాఖ

### ప్రజల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు : శ్రీధర్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాలో ఏర్పడే అవాంతరాలను తక్షణం పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నామని తక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు పడిపోవడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు మండపేట నియోజకవర్గ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని ఏపీ ఈపీడీసీఎల్ డిఈఈ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే ఈ క్రింది నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

మండపేట టౌన్ : 9440904519, ద్వారపూడి సెక్షన్: 9440904527, ఆలమూరు సెక్షన్: 9440904521, రాయవరం సెక్షన్: 9493178873, ఏడిద సెక్షన్: 9440904503, మండపేట, రాయవరం, ఆలమూరు మండలాల సమస్యల కోసం: 9493178836. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక విద్యుత్ సిబ్బందిని కూడా అవసరమైతే సంప్రదించాలని సూచించారు. అలాగే, తెగిపడిన విద్యుత్ తీగలు లేదా పడిపోయిన స్తంభాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

# మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం...

### పునరావాస కేంద్రాలు ఏర్పాటు...


### అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉన్నారు : ఎమ్మెల్యే వేగుళ్ల



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. మండపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండపేట నియోజవర్గానికి తుఫాను ముప్పు పొంచి ఉన్నప్పటికీ నియోజకవర్గం లోని మూడు మండలాలు, పట్టణంలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాటాకు ఇళ్లల్లో ఉండే వారి సమాచారం అధికారులు ఇప్పటికే సిద్ధం చేసుకుని ఉన్నారన్నారు. తగు సమయంలో వీరిని ఆయా కేంద్రాలకు అవసరాన్ని బట్టి తరలించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణంలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్రింది నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు

కపిలేశ్వరపురం మండలప్రజలు 9381145177, మండపేట మండల ప్రజలు 7989997185,
రాయవరం మండల ప్రజలు 9618006344, మండపేట పట్టణ ప్రజలు 9849906527.

ఎటువంటి సమస్యను అయినా ఎదుర్కొందుకు అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ళ కోరారు.



# ఎడిటర్ వాయిస్

## ఇక పాఠ్యాంశాల్లోకి కల్పనలేనా!

ప్రారంభమైన అరవై నాలుగేళ్ల తర్వాత ఎన్సీఈఆర్టీ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. భారతదేశం ప్రజాస్వామ్య దేశమన్నది మరిచి, అధికారంలో ఉన్న వారికి అనుగుణంగా తిరోగమనంలోకి వెళ్లింది. జీవ పరిణామ సిద్ధాంతం– సైన్సు పాఠ పుస్తకాల్లోంచి తీసి వేయడమే కాకుండా, ఢిల్లీ సల్తనత్, మొఘ లుల ప్రసక్తి లేకుండా సిలబస్ ఏర్పాటు చేశారు. హిందూ తీర్థ స్థలాల విశేషాలు, కుంభమేళా వంటి ఆధ్యాత్మిక సంబంధిత విషయాలను 6నుండి 8వ తరగతి సోషల్ సైన్స్‌లో చేర్చారు. పాఠ్యాంశాల విషయంలో ఎన్సీఆర్టీ అహేతుకమైన నిర్ణయాలు తీసు కోవడమే కాకుండా, తాము హేతుబద్ధంగా ఈ మార్పులు చేర్పులు చేశామని చెప్పుకున్నది. అసలు హేతుబద్ధత అంటే ఏమిటీ? నిజాలు అంటే ఏవీ? అనే విషయాలు కేంద్ర ప్రభుత్వంలో ఉన్నవారికి తెలిసినట్టు లేదు. కనీసం ఆ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆ సంస్థ అధికారులకు కూడా తెలిసినట్టు లేదు. తెలిసినా, తమ స్వార్థ ప్రయోజనాల కోసం మనసులు చంపుకుని ప్రభుత్వాధినేతల సూచనల మేరకు విధులు నిర్వర్తిస్తున్నట్లుగా ఉంది. మనం మన రాజ్యాంగంలో రాసుకున్నట్టు వైజ్ఞానిక స్పృహకు విఘాతం కలుగుతున్నందువల్ల, భావితరాలన్నీ అంధకారంలో కూరుకుపోబోతున్నాయి గనక, దేశ పౌరులందరూ ఈ విషయాల మీద దృష్టి సారించాల్సి ఉంది! సహేతుకమైన పాఠ్య ప్రణాళిక కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సి ఉంది!! హిందూ తీర్థ స్థలాల విశేషాలు, అత్యంత అనాగరికమైన మహా కుంభమేళా గురించి ఒక కొత్త పాఠం చేర్చడం వల్ల ప్రపంచ జ్ఞానం కలుగుతుందా? వివేచన పెరుగుతుందా? అనవసరంగా హిందుత్వను, తమ హిందూ రాష్ట్ర సాధన ఉద్దేశాన్ని పసి పిల్లల మెదళ్లలోకి ఎక్కించే ప్రయత్నం చేయడం ఎందుకు చేస్తున్నారు? వీటితో పాటు ఒకప్పుడు దేశ విదేశాల్లో విసృత ప్రచారంలో ఉన్న బౌద్ధాన్ని నాశనం చేసిన ఘనుల వంశమైన శృంగ వంశం గురించి పిల్లలకు పాఠం పెడతారా? ఒకవేళ పెట్టినా వాస్తవ చరిత్ర బోధిస్తారన్న నమ్మకమేముందీ? అభూత కల్పనలతో కథలు అల్లి చెపుతారేమో? గత పదకొండేళ్లుగా అధికారంలో ఉన్న ఈ ఆర్ఎస్ఎస్– బీజేపీ ప్రభుత్వం అబద్ధాలతో విద్వేషాన్నే కదా ప్రచారం చేస్తున్నది! మీడియా సంస్థల్ని కొన్నది సరిపోలేదు. ఈడీ, సీబీఐ, కోర్టులు వంటి వ్యవస్థల్ని ధ్వంసం చేసింది సరిపోలేదు. అమెరికాకు గులాంగిరి చేస్తున్నది సరిపోలేదు. అందుకే ఇప్పుడు పాఠశాల విద్యార్థుల మెదళ్లు పాడు చేయడానికి ఒక కొత్త పథకం రూపొందించారు. గతంలో యూపీఏ అధికారంలో ఉండగా, వారి కాలంలో విధించిన 'ఎమర్జెన్సీ'కి సంబంధించిన పాఠం సోషల్ స్టడీస్‌లో ఉండేది. మరి అలాంటి ధైర్యం ఈ ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వానికి ఎందుకు లేదు? ధైర్యముంటే తమ ఆధ్వర్యంలో జరిగిన గుజరాత్, మణిపూర్ మారణకాండలు పాఠాల్లో పెట్టాలి. చరిత్ర పాఠ్యాంశాల్లో మొఘలుల పరిపాలనా కాలాన్ని తొలగించినందుకు ఎన్సీఈఆర్టీ చెపుతున్న కారణాలు ఏవంటే, మొఘలులు పెద్ద ఎత్తున మత మార్పిడులు చేశారు, సొంత తండ్రుల్ని, అన్నదమ్ముల్ని చంపి రాజ్యాధికారం చేపట్టారు, హిందూ దేవాలయాల్ని కూల్చారు. హిందువుల్ని ద్వేష భావంతో చూశారు. వారిపై జిజియా పన్ను విధించారు. పైగా వారి మూలాలు ఈ దేశంలో లేవు. వారంతా దోపిడి దారులు, దేశాన్ని దోచుకునిపోయారని చెబుతున్నారు. మరి ఈ కారణాల్లో వాస్తవాలు ఎన్ని? అవాస్తవాలు ఎన్ని అనేది ప్రశ్న. హిందూ ప్రచారంలో ప్రముఖుల అభిప్రాయాల ప్రకారం పరిశీలిస్తే, స్వామి వివేకానంద ప్రకారం, మొఘలుల కాలంలో బెంగాల్‌లో ముస్లింల జనాభా పెరగడానికి కారణం, ఆ రోజుల్లో హిందువులైన భూస్వాముల, జమీందార్ల ఆగడాలు, హిందూ పురోహితుల కఠిన నియమాలు. వీటి నుంచి తప్పించుకోవడానికి పేద హిందూ రైతులు ఇస్లాంలోకి మారేవారు. దానివల్ల మొఘల్ చక్రవర్తి రక్షణ వారికి లభిస్తూ ఉండేది. ఇక కొందరేమో వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి ఇస్లాం స్వీకరించేవారు. అంతేగాని, మొఘలులు బలవంతంగా అధికారికంగా హిందువుల్ని ఇస్లాంలోకి మార్చిన దాఖలాలు లేవు. అలా అని చరిత్ర పుటల్లో ఎక్కడా నమోదు కాలేదని చెప్పారు.. పైగా అణగారిన వర్గాల వారు నిరుపేదలు, నిరాశ్రయులు సైతం ముస్లింల పాలనలో అంటే మొఘలుల పాలనలోనే స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నారని నమోదు చేశారు.. మనం ఆలోచించినా.. మొఘలులు బలవంతంగా మత మార్పిడులు చేసి ఉంటే ముస్లింల జనాభా శాతం చాలా పెరగాల్సింది కదా? మరి ఆ రోజుల్లో హిందువులు 80–85 శాతమున్నారు కదా? పోనీ తర్వాత అయినా ముస్లిం జనాభా పెరిగారా అంటే అదీ లేదు.. 2011లో జరిగిన జనాభా లెక్కల్లో సైతం, ముస్లింల జనాభా 14–23 శాతం మాత్రమే ఉందని తేలింది! ఇక మొఘలులు స్వంత తండ్రుల్ని, కుటుంబీకులను చంపి రాజ్యం హస్తగతం చేసుకునేవారు. ఇది నిజమే! అయితే ఈ విషయం



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# చందమామతో కొడవటిగంటి అనుబంధం

దాదాపు ముప్పై సంవత్సరాలుగా "చందమామ" సంపాదక వర్గంలో ముఖ్యుడిగా వుంటూ, 'చంద మామ' అభివృద్ధికి దోహదం చేసిన సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. ''చందమామ'ను అభిమానించే అసంఖ్యాక పాఠకులు, అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా ఆయన నిలిచి పోయారు. కథకుడుగా, విమర్శకుడిగా, వ్యాస, నవలా రచయితగా ఆయన సాధించిన ఖ్యాతి తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే. 'చందమామ'లో ఎవరు ఏ కథ రాసినా, ఆ కథకు మెరుగులు దిద్ది, అందం తెచ్చి, చదివింప జేసిన ఘనత ఆయనది. తన అనుభ వాన్ని రంగరించి, సులభ భాషలో చందమామ పాఠకులకు ఆయన అందించిన వేలాది కథలు బాల సాహిత్యంలో ఆణి ముత్యాలు. చక్రపాణి ఆశయాలను సాకారం చేసి, చందమామకు ప్రత్యేకత కల్పించి, తన ప్రతిభతో పాఠక లోకాన్ని తక్కిన పత్రికలను కాదని చందమామ వైపు ఆకర్షింప చేసిన మేధావి కొడవటిగంటి. తెలుగు రచయితల్లో సుప్రసిద్ధ చెందిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు ఒకరు. సమకాలీన మానవ జీవితాన్ని సునిశి తంగా పరిశీలించి తన రచనలతో సహజత్వాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్త ఆయన. తెలుగు మధ్య తరగతి కుటుం బాలను (కొంత ఎక్కువగా బ్రహ్మణ కుటుంబాలను) నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లోకి ఆయన తీసుకొన్నారు. జాతకాలు – వాటి ప్రభావా లు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూర్ఖత్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ – పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు ఆయన రచనల్లో ప్రధాన వస్తువులు. కొడవటి గంటి కుటుంబరావు (1909 అక్టోబర్ 28 – 1980 ఆగష్టు 17), ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది. "కొకు" గా చిరపరిచితు డైన ఆయన తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది వేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యులు. కుటుంబరావు గుంటూరు జిల్లా, తెనాలి లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తెనాలిలో పాఠశాల చదువు 1925 వరకు సాగింది. చిన్న వయసులోనే 1914లో తండ్రీ, 1920లో తల్లీ మరణించడంతో మేనమామ వద్ద పెరిగారు.



ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకు పోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకట సుబ్బయ్య ద్వారా ఆయన సాహితీ రంగ ప్రవేశం జరిగింది. ఆ కాలంలోనే ఆయనకు పాశ్చాత్య సాహిత్య పరిచయం జరిగింది. పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా రాసారు. కొద్ది కాలం లోనే వాటిని వదిలి పెట్టారు. 1925లో ఉన్నత విద్య పూర్తికాక ముందే 11 ఏళ్ళ పద్మావతితో ఆయన పెళ్ళి జరిగింది. 1925 నుండి 1927 వరకు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియేటు చదివాక, 1927–29 కాలంలో మహారాజా కళాశాల, విజయ నగరంలో బియ్యే ఫిజిక్సు చదివారు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్ గా మొదలు పెట్టాడు. బియ్యే చివరికి వచ్చేసరికి ఆయన నాస్తికునిగా మారిపోయారు. 1929లో కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి ఫిజిక్సులో చేరారు. 1930లో ఆయన తొలిరచన సినిమా ఓరియంటల్ వీక్లీలో ప్రచురిత మైంది. ఆయన మొదటి కథ ప్రాణాధికం గృహలక్ష్మి మాస పత్రికలో అగ్రస్థానం పొందింది. కారణాంతరాల వల్ల ఎం.ఎస్.సి రెండో సంవత్సరం చదువు ఆగిపోయింది. 1931లో కొంతకాలం పాటు వరంగల్ లో ఉండి పిల్లలకు ప్రైవేట్లు చెప్పారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివ రావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపించి యువ పత్రికను ప్రారంభించారు. 1940 – 42 మధ్య కాలంలో ఆంధ్ర పత్రికలో పని చేసారు. ఆ సమయంలో జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహోద్యోగి. 1942 లో నాలుగు నెలల పాటు ఒక మెటలు కర్మాగారంలో పని చేసారు. 1942 జూలై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీ రైటరుగా పనిచేసారు. 1944లో ఒడిషా జయపూరులో ఇన్స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఆర్నెల్ల పాటు ఫోర్మనుగా పనిచేసారు. 1948లో మూణ్ణెల్ల పాటు బొంబాయి ఎయిర్ ఇండియా కార్యాలయంలో ఎకౌంట్సు క్లర్కుగా పనిచేసారు. 1948లో ఆంధ్రపత్రిక దినపత్రికలో చేరి 1950–51లో వారపత్రిక సంపాదకత్వం నిర్వహించారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే సిద్ధాంతాన్ని... బుద్ధికొలత వాదం అనే పేరుతో ఆయన ప్రతిపాదిం చారు. ఈ ప్రతిపాదన అనేక చర్చలకు దారితీసింది. 1937లో రాసిన ఆయన రచన కారుణ్యం ముందు మాటలో... నాకు ఒకటే ఆశయం – నా రచనల వల్ల కూడా మనోవికాసం పొంద దగిన వాళ్ళు తెలుగు వాళ్ళలో ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలని నా కోరిక. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను తెలుగు సారస్వతానికి. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది. నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ నాకు ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు... అని తన మనసు లోని మాటను స్పష్టం చేశారు. 1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చందమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి నిర్విరామ కృషి సలిపారు.

# యానిమేషన్‌తో ప్రతిసృష్టి

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, ఫిలిమ్ అవతార్, బాహుబలి సినిమా, పౌరాణిక గాథల ఆనిమేషన్ చిత్రాలు లాంటి పాత్రల ప్రభావం మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మొదలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు ఆనిమేషన్ కళకు సృజన జోడించి వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను ఆనిమేషన్ కళలో ప్రత్యేకతలుగా, సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా, ఆకర్షణీయంగా తక్కువ సమయం లో గొప్ప భావాలను వ్యక్తం చేయవచ్చు. అక్టోబర్ 1892లో తొలి సారి పారిస్‌లో ఆనిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా ఆనిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్య, చలనచిత్రరంగాల్లో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో "ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్" నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఆనిమేషన్ డే)' పాటించుట జరుగుచున్నది. ఆనిమేషన్ కళకు సృజనను జోడించి నూతన త్వాన్ని ఆపాదించడం, ఆనిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, ఆనిమేషన్‌లో వినూత్న భావాలను జోడించడం, ఆనిమేషన్ ఆర్ట్ గూర్చి కార్యశాలలు నిర్వహించడం, ప్రఖ్యాత ఆనిమేషన్ ఫిలిమ్‌లను ప్రదర్శించడం, ఆనిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, ఆనిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవ వేదికలను వినియోగించుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆనిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు, ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బోమ్మల కదలికలతో చిత్రాలు తీయడాన్ని ఆనిమేషన్ నైపుణ్య కళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ, వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం ఆనిమేషన్ ప్రత్యేకత. స్వల్ప వ్యవధిలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యం ఆనిమేషన్ కళకు ఉంటుంది. ఆనిమేషన్‌లో సంప్రదాయ, 2డి, 3డి, మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్, కటౌట్ అండ్ కల్లాజ్, రోటోస్కోపింగ్, సెల్ ఆనిమేషన్ మొదలగు రకాలు ఉన్నాయి. సాధారణ జనాలతో కాకుండా వ్యాపారవర్గాలలో కూడా ఆనిమేషన్ కళ ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. డిజిటల్ విప్లవం, అంతర్జాల ప్రభంజనం నేపథ్యంలో ఆనిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమాలు, టివీల్లో ఆనిమేషన్ కళ ప్రవేశంతో ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అన్ని వర్గాల, వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. ఆనిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేక పోవడంతో సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షనీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, కంటికి ఇంపైన రంగుల చిత్రాలు తీయగలగడం లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. 1906లో స్టువార్ట్ బ్లాక్టన్ మొదటి ఆనిమేషన్ చిత్రం 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' తీయడం జరిగింది. 1928లో వాల్ట్ డిస్నీ 'స్టీంబోట్ విల్లి' అనబడే ప్రథమ ఆనిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్ తీయడం జరిగింది. 1937లో మొదటి పూర్తి నిడివిగల ఆనిమేటెడ్ 'స్నోవైట్' అనే చలనచిత్రాన్ని వాల్ట్ డిస్నీ తీశారు. 1993లో 3డి ఆనిమేషన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక డిజిటల్ యుగపు యువత ఆనిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య ఆనిమేషన్ దృశ్య రుచులను చూపుతారని ఆశిద్దాం.

# నిబద్ధతకు నిలువుటద్దం రాఘవాచారి

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, విలువలు, నిబద్ధతతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన పాత్రికేయులు, సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు చేశారు. రాఘవాచారి స్వస్థలం వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం. 1939 సెప్టెంబరు 10న ఆయన జన్మించారు. నిబద్ధతత, విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచారు. తెలుగు పబ్లిక్ రచయితల్లో నిరుప మానమైన మేధావి చక్రవర్తుల రాఘవాచారి, తెలుగు, ఇంగ్లీష్ సంస్కృత భాషల్లో పండితులు. పాత్రికేయుడు, సీనియర్ జర్నలిస్ట్. 1972 నుండి 2005 వరకు విశాలాంధ్రలో సంపాదకుడిగా పనిచేశారు. ఆయన మూర్తీభవించిన నిజాయితీ పరుడు. ఆయన వృత్తిలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాంప్రదాయక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయిదో ఏటి నుంచి ప్రబంధాలు, ప్రాచీన కావ్యాలు రామాయణ మహా భారతాలు చదివారు. ఆయనకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ నేర్పడానికి ముగ్గురు ఉపాధ్యాయులను నియ మించారు. సంస్కృతం నేర్చు కోవడానికి ఆయనను ఆంధ్ర ప్రాంతంలోని పొన్నూరు పంపించారు. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతా పురం గ్రామంలో జన్మించిన రాఘవాచారి సికింద్రాబాద్ సమీపంలోని లాలాగూడ రైల్వే పాఠశాలలో 11వ ఏట అయిదో తరగతిలో చేరారు. 1953 నుంచి విశాలాంధ్ర చదవడం ప్రారంభించారు. నిజాం కళాశాలలో పి.యు.సి.లో చేరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం 6వ ర్యాంకు సాధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. కానీ ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చేటప్పటికి ఆయనకు చదువు మీద ఆసక్తి తగ్గింది.



వరంగల్ వెళ్లి బీఎస్సీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరారు. కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసి అద్భుతమైన మెజారిటీతో గెలిచారు. పట్టభద్రుడైన తరువాత హైదరాబాద్ వచ్చి న్యాయశాస్త్రం చడివారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధిగా లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. అప్పుడు విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లీష్ చదువుతున్న ఎస్. జైపాల్ రెడ్డి వంటి వారు తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినా రాఘవాచారి అఖండ విజయం సాధించారు. న్యాయ శాస్త్రంలో పట్ట భద్రుడైన తరువాత ఎల్.ఎల్.ఎం. చేశారు. 1969–71 మధ్య ఆయన ఢిల్లీ నుంచి వెలువడే వామపక్ష అనుకూల ఇంగ్లీష్ పత్రిక విలేకరిగా పని చేశారు. 1971లో ఆయన విజయవాడ వెళ్లి విశాలాంధ్రలో చేరారు. కొద్ది కాలానికే ఆ పత్రికకు సంపాదకుల య్యారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకులుగా ఉన్నారు. ఆయన సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా ఉండేవి. స్పష్టత, సంక్షిప్తత ఆయన శైలి. 'తెలుగు పత్రిక పరిణామం – ప్రయోగాలు – ప్రయోజనం' అన్న వ్యాసంలో తెలుగు పత్రికా రంగంలో వాడే భాషా ప్రామాణీకరణ జరగలేదని విచారం వ్యక్తం చేశారు. విజయ వాడ, ఇతర ప్రాంతాల.లోనూ ఉపన్యాసకుడిగా ఆయనను ఆహ్వానించే వారు. ఆయన మాటల్లో అడుగడుగునా వ్యంగ్యం తొణికిస లాడేది. ఆయన గొప్పవాడిగా కనిపించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. మేధావిగా ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నా ఎనిమిది పదుల వయసు నిండి నాకా, ఆయనతో మాట్లాడిన వారు ఎవరైనా ఆయన జ్ఞాన విస్తృతి చూసి ముచ్చట పడేవారు. నిబద్ధత కలిగి, విలువలకు జీవితాంతం కట్టుబడిన కమ్యూనిస్టుగా విజ్ఞానఖనిగా రాఘవాచారి పేరు గాంచారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. 30 ఏళ్ల పాటు విశాలాంధ్ర సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించిన రాఘవాచారి, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవాచారి 2005 వరకు కొనసాగారు. రాఘవాచారి, హైదరాబాదులోని ఒక హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ 2019, అక్టోబరు 28వ తేది తెల్లవారు జామున మరణించారు. తెలుగు పత్రికా రంగానికి ఆయన చేసిన సేవను తెలుగు ప్రజలు ఎప్పుడూ

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

మంగళవారం, 28 అక్టోబర్ 2025
www.viswamvoice.com






### కోటిపల్లి రేవు, పునరావాస కేంద్రాన్ని

# పరిశీలించిన మంత్రి సుభాష్

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు - ప్రభుత్వం అండగా ఉంటుంది..ధైర్యంగా ఉండాలంటూ ప్రజలకు సూచన**

**యుద్ధ ప్రాతిపదికన ముందస్తు రక్షణ చర్యలు తీసుకున్నాం : మంత్రి వాసంశెట్టి సుభాష్**





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సందర్శించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం కోటిపల్లిలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పునరావాస కేంద్రంను పరిశీలించారు.కోటిపల్లి పుష్కర ఘాట్లను,రేవును ఆనుకుని ఉన్న వీధులలో తిరిగి ప్రజలను అప్రమత్తం చేశారు.తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలు ఉండడంతో ప్రజలంతా ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు రక్షిత మంచినీరు, ఆహారం,పాలు,తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.తుఫాను సంబంధిత సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్‌కి తెలియజేసి సహాయం పొందాలని సూచించారు. పలువురు ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం ముందస్తుగా అన్ని రక్షణ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు.ఇప్పటికే ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అన్ని విభాగాల అధికారులు కూడా తుఫాను సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారన్నారు. వాతావరణం ప్రశాంతంగా ఉందని అశ్రద్ధ వద్దని, ప్రజల భద్రతే ముఖ్యమన్నారు.ఎలాంటి ఆస్తి,ప్రాణనష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ సెలవులు రద్దు చేయడం జరిగిందన్నారు. గతంలో వచ్చిన హుద్ హుద్, తిథలి తుఫాన్ల అనుభవంతో ఎలాంటి నష్టం జరగకుండా యుద్ధ ప్రాతిపదికన తగు రక్షణ చర్యలు చేపట్టామన్నారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, స్థానిక కూటమి నాయకులు, వెంటూరి వీర్రాఘవులు, కోటిపల్లి సర్పంచ్ పేమ్మాడి బేబీ సత్తిబాబు, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, కంచుమర్తి బాబురావు, యువ నాయకులు, గొడవర్తి రామకృష్ణ చీకట్ల సోమేష్, చీకట్ల రాము, కోటిపల్లి మత్యకారసొసైటి ప్రెసిడెంట్ ఓలేటి సుబ్రహ్మణ్యం, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఓడలరేవు సైక్లోన్ సెంటర్‌లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు తీర ప్రాంతంలో మంథ తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది అని అధికారుల సమాచారం మేరకు సైక్లోన్ సెంటర్‌లో ప్రజలకు అందుబాటులో మెడికల్ క్యాంప్‌ను సర్పంచ్ మల్లాడి మంగయ్యమ్మ ఉమామహేశ్వరరావు ఆద్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈదురుగాలులు, వర్షం తుఫాన్ ప్రభావం ఎక్కువ గా వుండటం వలన ప్రజలు అప్రమత్తం గా ఉండాలని,ఎవరికైనా ఎటువంటి ఇబ్బంది ఏర్పడిన దగ్గరలో ఉన్న పునరావాస కేంద్రానికి తరలి రావాలని ప్రజలకు సూచించారు.ప్రజలకు అందుబాటులో మెడికల్ క్యాంప్ కూడా ఉందని ప్రజలకు తెలియజేశారు. ఓడలరేవు మెడికల్ క్యాంప్‌ను సోమవారం డిఎమ్‌హెచ్ఓ డాక్టర్ దుర్గారావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్వైజర్ రంగనాథ్, హెచ్ వి.సుజాత, సిహెచ్ఓ, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం డివిజనల్ పరిధిలో

# తుఫాన్ ప్రభావంపై ఆర్డీఓ అఖిల పరిశీలన

**పలు గ్రామాలను సందర్శించిన ఆర్డీఓ - అన్ని ఏర్పాట్లు చేసాం.. ప్రభుత్వ అధికారులకు సహాయసాకారాలు అందించండి**

**కంట్రోల్ రూమ్ నెంబర్లు అందుబాటులో వున్నాయి - ఆపద అంటే హలో అని కాల్ చేయండి - అధికారులు అప్రమత్తంగా ఆన్ డ్యూటీలో వున్నారు**





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రకృతి విపత్తులు మరియు నిర్వహణ శాఖ వారి సూచనలు మేరకు రాబోవు మూడు రోజుల్లో మొంథా తుఫాన్ కారణంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మీదుగా తీవ్ర ఈదురు గాలులు మరియు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హెచ్చరించి యున్నారు. సదరు మొంథా తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఐఏఎస్ అన్ని మండల కేంద్రాల్లో మరియు గ్రామాలలో ప్రజలు అందరికి, అధికారులు అందరూ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవలెనని మరియు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించి ఉన్నారు. అందులో భాగంగా రామచంద్రపురం దివిజినల్ అధికారి డి.అఖిల ఆధ్వర్యంలో రామచంద్రపురం మండలంలో మాలపాడు గ్రామము నందు ఎం.పి.పి స్కూల్ మరియు వెంకటాయపాలెం గ్రామములో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ అలానే కే.గంగవరం మండలంలో గంగవరం, కోటిపల్లి గ్రామములలో జిల్లా పరిషత్ హైస్కూల్ గంగవరం, కోటిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రం లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అక్కడ ప్రజలకు కావాల్సిన ఏర్పాట్లను సందర్శించి, ముందుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతములకు లేదా ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రములకు వెంటనే వెళ్ళు విధముగా చర్యలు తీసుకోమని మండల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అఖిల మాట్లాడుతూ సదరు జిల్లా కలెక్టర్ వారి ఆదేశములు మేరకు రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న మండల స్థాయి కార్యాలయంలలో మండల అధికారులతోనూ మరియు రెవెన్యూ డివిజన్ అధికారి, రామచంద్రపురం వారి కార్యాలయం నందు డివిజనల్ స్థాయి అధికారులతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని,డివిజన్ పరిధిలో రామచంద్రపురం, కే.గంగవరం,మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలలో మరియు మండపేట, రామ చంద్రపురం మున్సిపాలిటీలలో తుఫాను కారణంగా ఎటువంటి సమస్యలు మీ దృష్టికి వచ్చినా డివిజనల్ స్థాయి కంట్రోల్ రూమ్ లేదా మండలస్థాయి కంట్రోల్ రూమ్ కు ప్రజలు వెంటనే సంప్రదించవలెనని తెలియజేసారు.అలానే (డివిజన్ కంట్రోల్ రూమ్) దృష్టికి వచ్చినటువంటి సమస్యలను వెంటనే మండల స్థాయి సంబందిత అధికారులకు తెలియజేసినట్లు అయితే వెంటనే పరిష్కరించే విధముగా చర్యలు తీసుకొను నిమిత్తం డివిజనల్ స్థాయి అన్ని డిపార్ట్మెంట్ల అధికారులతో కంట్రోల్ రూము ను రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ కార్యాలయము నందు ఏర్పాటు చేయడమైనదన్నారు.

ఈ క్రింది తెలిపిన విధంగా కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసిన వివరాలు ఇలా వున్నాయి.

రెవిన్యూ డివిజనల్ కార్యాలయము, రామచంద్రపురం - 08857-245166

తహశీల్దారు, రామచంద్రపురం - 9849386738

తహశీల్దారు,కే.గంగవరం - 9030422739

తహశీల్దారు,మండపేట - 7989997185

తహశీల్దారు, కపిలేశ్వరపురం- 9381145177

తహశీల్దారు,రాయవరం - 9618006344

నెంబర్లు ఉపయోగించుకోవాలన్నారు.

తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు గ్రామ,మండల మరియు డివిజన్ స్థాయి అధికారులు ఇచ్చే సూచనలను పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు,పసిపిల్లలు ఉన్నవారు,శిథిలావస్థ భవనంలో నివసిస్తున్న వారు మరియు పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారు,లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ముందుగా సురక్షిత ప్రాంతములకు లేదా ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రములకు వెంటనే వెళ్ళవలసిందిగా తెలియజేయడమైనది. ఇతర ప్రజలు అందరూ బహిరంగ ప్రదేసములలోను, విద్యుత్ స్థంబాలు వద్ద, వృక్షాలు క్రింద మరియు నీటి ప్రవాహాలకు దూరంగా ఉంటూ సురక్షిత ప్రాంతాలలో (ఇళ్ళలో) ఉండవలెనని తెలియచేస్తూ రాబోవు మూడు రోజులు అప్రమత్తంగా ఉంటూ అత్యవసర సహాయం కొరకు పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబర్లను లేదా మీ గ్రామ పరిధిలో గల గ్రామ సచివాలయం నందు సిబ్బందిని సంప్రదించవలసినదిగా తెలియజేసారు.కావున ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకొని సురక్షిత ప్రాంతాలలో ఉంటూ ప్రభుత్వ అధికారులుకు తమ సహాయసాకారాలు అందించాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల యొక్క వ్రాతపూర్వక అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి అని, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, భాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 05 మంది ఫిర్యాదీదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీ రాహుల్ మీనాకి విన్నవించుకున్నారు.

## వ్యాపారస్థులకు రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ హెచ్చరికలు

**ప్లాస్టిక్ వాడకండి, పటిష్టంగా పరిశీలిస్తాం..**

**పొరపాటున దొరికితే భారీగా జరిమానా తో పాటు చర్యలు ఉంటాయి : మున్సిపల్ కమిషనర్ రాజు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పురపాలక సంఘం నందు మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు అధ్యక్షతన హొటల్ మరియు ఫాస్ట్ ఫుడ్ వర్థకుల సంఘం సభ్యులకు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రధాన అంశంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు వాడరాదు మరియు 10 రకాల ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయ వస్తువులను స్టాల్స్ పెట్టి ప్రదర్శన ద్వారా వర్తకులలో అవగాహన కల్పించుట జరిగినది. ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు అడిగిన బయో డిగ్రీడబుల్ కవర్లు అనగా నేలలో కరిగే మొక్క జొన్న కంకి తో తయారుచేసిన కవర్లు మాత్రమే ఇవ్వవలేనని మరియు వాటికి ఐదు రూపాయలు ఛార్జిలను వసూలు చేసుకొన వచ్చునని తెలియజేయుట జరిగినది.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన సూచనలు మరియు జీవోలను వివరిస్తూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ గురించి వివరించుట జరిగినది. రామచంద్రపురం పరిధిలో గల హొటలలో,టిఫిన్, పానీపూరి బండ్లు,పళ్ళ దుకాణాలు,కిరాణా దుకాణాలు నిర్వహించే వారు అందరూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ మరియు ఫుడ్ సేఫ్టీ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని కోరుట జరిగినది.ఆహార పదార్థాలు అమ్మేవారు నిల్వ ఆహర పదార్ధాలను అమ్మినట్లయితే తగిన జరిమానా విధిస్తామని హెచ్చరించుట జరిగినది. సదరు సమావేశమునకు హొటల్ వర్తకుల ప్రెసిడెంట్ కె.శివ, ట్రెజ్జరరు చిన్ని స్వామి,సెక్రెటరీ రాజు, నవీన్ లు,తధితర వర్తకుసంఘ సభ్యులు పాల్గొన్నారు. ముంధా తుఫాను దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదు అనియు,నిత్యవసర సరుకులు అన్నియు సమకూర్చుకోవాలని విద్యుత్ అంతరాయాలు ఏర్పడినట్లు అయినా కొవ్వొత్తులు అందుబాటులో ఉంచుకోవాలని ఏదైనా అత్యవసరం అయితే పురపాలక సంఘ కార్యలయం నందు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నెం.08857 242349 నకు సంప్రదించవలసినదిగా పట్టణ ప్రజలకు తెలియజేయడమైనది.

## తాళ్లపాలెంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం తాళ్ల పొలం గ్రామంలో ఆదివారం పేట రోడ్డులో ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన ధ్వజస్తంభ ప్రతిష్ట ప్రారంభోత్సవం బ్రాహ్మణులు అయ్యల సోమయాజుల శర్మ బ్రహ్మత్వాన మరియు గ్రామ ప్రజల సహాయ సహకారంతో పూజా కార్యక్రమాలు హెూమ కార్యక్రమం జరిగింది.అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నురుకుర్తి శ్రీను, పెంకె ముసలయ్య, నీల సత్తిరాజు, గురజాపు విగ్నేష్, మట్టపర్తి రామకృష్ణ, వనం శ్రీను, పంపన శ్రీను గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## నడి రోడ్డుపై వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

**కొత్తపేటలో పెరిగిన వీధికుక్కల బీభత్సం - సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటలో వీధి కుక్కల దాడులు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. స్థానిక సత్యచంద్ర థియేటర్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న పనసలదొడ్డి గ్రామానికి చెందిన కదలి పెద్ద ఏడుకొండలు కుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు.శనివారం జరిగిన ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. కదలి ఏడుకొండలు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా ఒక కుక్క వెనుక నుండి వచ్చి ఆయనపై దాడి చేసి కింద పడేసింది.ఈ దాడిలో ఆయన కాలు మరియు మణికట్టు ప్రాంతంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే కుక్కను తరిమేయడంతో ప్రమాదం తప్పింది.రక్తం కారుతున్న ఆయనను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**పిల్లల భద్రతపై ఆందోళన**

ఈ సంఘటనతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు రక్షణ కరువు పగలైనా, సాయంత్రమైనా వీధుల్లో పిల్లలు ఆడుకోవడానికి పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. కుక్కలు ఎప్పుడూ గుంపులు గుంపులుగా తిరుగుతూ, చిన్న పిల్లలను లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అకస్మాత్తు మరణాలు**

ఇటీవల కుక్క కాటుకు గురైన కొందరు రాబీస్ వ్యాధి కారణంగా మరణించడం ప్రజలను మరింత కలవరపరుస్తోంది. ఒక చిన్న కాటు కూడా ప్రాణాంతకం కావచ్చుననే భయం ప్రజలను వెంటాడుతోంది.

**నివారణ చర్యలు శూన్యం**

కుక్కల జనాభా పెరగకుండా ఉండేందుకు స్థానిక అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదని,స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ సమస్యపై వెంటనే స్థానిక పంచాయతీ మరియు ఉన్నతాధికారులు దృష్టి సారించి, కుక్కల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని, ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు భద్రత కల్పించాలని కొత్తపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### మొంథా తుఫాన్‌పై

# కాకినాడ జిల్లా అప్రమత్తం

## జిల్లా ప్రజల భద్రతే ప్రభుత్వ ఏకైక లక్ష్యం - కాకినాడ ఎంపి ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళా ఖాతంలో ఏర్పడి వేగంగా దూసుకొస్తున్న మొంథా తుఫాన్ కాకినాడ తీర ప్రాంతాన్ని ముంచే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లా పరిపాలనా యంత్రాంగం మొత్తం అప్రమత్తమైంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఏవైనా గడ్డు పరిస్థితులను సైతం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కాకినాడ జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సంసిద్ధమైందని కాకినాడ ఎం.పి. ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక మీడియా ప్రకటన వెలువరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ, మండలాల్లోనూ 24 గంటల కంట్రోల్ రూమ్‌లు, పునరావాస కేంద్రాలను సిద్ధం చేసామని ఆయన వెల్లడించారు. జిల్లా, మండల కేంద్రాల్లో 24/7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, అందులో అన్ని శాఖల సిబ్బందిని కేటాయించి తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ వసతి గృహాలను తాత్కాలిక పునరావాస కేంద్రాలుగా గుర్తించి, ఆహారం, త్రాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అన్ని అవసరమైన సౌకర్యాలను కల్పించాం అన్నారు. ప్రతి పునరావాస కేంద్రానికి ఇన్‌చార్జీలను నియమించి, అక్కడికి అవసరమైన మందులు, దుప్పట్లు, త్రాగునీటి ట్యాంకర్లను సిద్దం చేసాం. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యల కోసం 50 ఎస్డీఆర్ఎఫ్, 30 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాం. ప్రత్యేకంగా పల్లపు ప్రాంత గ్రామాల్లోని ప్రజలను, పశు సంపదను సురక్షిత, ఎత్తైన ప్రాంతాలకు ముందస్తు తరలింపు ప్రారంభించాం. అత్యవసర సమయాల్లో రోగులను తరలించేందుకు 108 అంబులెన్సులు 23, అలాగే 104 వైద్య వాహనాలు 35 సిద్ధంగా ఉంచాం. తుఫాన్ ప్రభావంతో వర్షపాతం పెరిగే అవకాశం ఉన్నందున ఏలేరు ప్రాజెక్ట్ మిగులు నీటి విడుదలపై ముందస్తు హెచ్చరికతో ఏలేరు ప్రాజెక్ట్ నుండి నీరు విడుదల చేసే అవకాశం ఉంది. అందువలన కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ బృందాలు మోహరించాయి. తుఫాను ప్రభావంతో విద్యుత్తు సరఫరా నిలిచి పోకుండా తగు జాగ్రత్తలు తీసుకునేందుకు ఇతర జిల్లాల నుండి అవసరమైన విద్యుత్ సిబ్బందిని రప్పించారం. అలాగే తీర ప్రాంత మత్స్యకారులకు అవసరమైన నిత్యావసర సరుకులు, ఇంధనం, వైద్య సాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. తుఫాను ప్రభావం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. ప్రతి ప్రాణం విలువైనది. సమయానికి స్పందించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, మన అందరి కర్తవ్యమూ" అని ఎంపీ పేర్కొన్నారు. తుఫాన్ బాధితుల సహాయార్థం కాకినాడ ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసాం. అదేవిధంగా 100 మంది జన సైనికులు సహాయక చర్యల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలకు ఏ తక్షణ సహాయం అవసరమైనా 24 గంటలూ అందుబాటులో ఉండేందుకు 99811 9981, 90638 01432 హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసాం. ప్రజల ప్రాణ భద్రతే మా ప్రాధాన్యం. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు సమిష్టిగా పని చేస్తున్నారు. భయపడకుండా, అధికారుల సూచనలు పాటించి భద్రతగా ఉండండని ఉదయ్ శ్రీనివాస్ సూచించారు. తుఫాన్ ప్రభావం పూర్తయ్యే వరకు ప్రజలు తమకు అవసరంలేని ప్రయాణాలను పూర్తిగా మానుకోవాలని, తీర ప్రాంతాలకు వెళ్లకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంగా కృషి చేస్తూ తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నారు. జీవ నష్టం, ఆస్తి నష్టం తగ్గించే దిశగా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయి అప్రమత్తతతో పనిచేస్తోందని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ (టీ టైం ఉదయ్) వెల్లడించారు.

### మొంథా తుఫాను చర్యలపై

# ఉన్నతాధికారుల సమీక్ష





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** తుఫాను ప్రభావం నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ ఎస్.షాన్మోహన్, ఐ.ఏ.ఎస్., జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐ.పి.ఎస్., మరియు స్పెషల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్ సోమవారం ఉప్పాడ బీచ్ ప్రాంతాన్ని సందర్శించారు. తుఫాను ప్రభావిత తీర ప్రాంత పరిస్థితులను పరిశీలిస్తూ, స్థానిక అధికారులతో పరిస్థితులపై వివరాలు సేకరించారు. అధికారులు సమీక్షా సమావేశం అనంతరం, సముద్రతీర ప్రాంత ప్రజల భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. తుఫాను కారణంగా వచ్చే భారీ గాలులు, అలల ప్రభావం గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా సముద్రతీరాలకు వెళ్లవద్దని కలెక్టర్ సూచించారు. మత్స్యకారులు సముద్ర యాత్రలు చేయకుండా ముందస్తు హెచ్చరికలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే ఎమర్జెన్సీ రెస్క్యూ బృందాలు, పోలీస్, రెవెన్యూ, మరియు ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని అధికారులు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అన్నపానీయాలు, విద్యుత్, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు నిరంతరంగా అందించేందుకు సంబంధిత శాఖలకు సూచనలు జారీ చేశారు. అధికారులు స్థానిక ప్రజలను ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని రకాల సహాయ చర్యలు చేపడుతున్నదని భరోసా ఇచ్చారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మొంథా తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా తనిఖీ




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐ పి ఎస్ ఉత్తర్వుల మేరకు కొత్తపేట డిఎస్పీ మురళీ మోహన్ ఆదేశాల ప్రకారం మొంథా తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా కొత్తపేట మండలంలోని బాలుర బాలిక వసతి గృహాలు హాస్టల్స్ భవనాలను రావులపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ మరియు కొత్తపేట ఎస్సై సురేంద్ర పరిశీలించారు హాస్టల్ భవనాలు సరిగా లేనియెడల వేరే ప్రదేశానికి విద్యార్థులను తరలించే ముందస్తు సహాయ చర్యలో భాగంగా తనిఖీ నిర్వహించారు.

### తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో

# కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో హెచ్చరికల నేపథ్యంలో కాకినాడ జిల్లా ఇంచార్జ్ మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలో విలీనమై అమలాపురం పార్లమెంట్ పరిధిలో ఉన్న తాళ్లరేవు మండలంలోని గ్రామాల ప్రస్తుత పరిస్థితి పై అధికారులను హరీష్ ఆరా తీశారు. విపత్కర పరిస్థితులు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. అవసరమైతే చెయ్యాల్సిన సహాయక చర్యలపై దృష్టి సారించాలని ఎంపీ హరీష్ అధికారులకు సూచించారు. అలాగే ఈ సమావేశంలో పాల్గొన్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ విపత్కర పరిస్థితులు ఏర్పడితే తమ పరిధిలోని గ్రామాలకు పూర్తి సహాయ సహకారాలను అందించాలని ఎంపీ హరీష్ కోరినట్లు తెలిపారు.

# పిల్లా చంద్రంకు రెండో గౌరవ డాక్టరేట్ పురస్కారం ప్రధానం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యా రంగం అభివృద్ధికి ఇటు వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలకు అటు ప్రభుత్వానికి మధ్య వారధిగా విద్యార్థుల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) పేరుతో ఏడు సంవత్సరాలుగా విశేష కృషి చేస్తోన్న అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రంను తాజాగా రెండో గౌరవ డాక్టరేట్ పురస్కారం కూడా వరించింది. కాకినాడ జిల్లా పిఠాపురంనకు చెందిన పిల్లా చంద్రంకు ఆసియా అమెరికన్ విజ్డమ్ పీస్ యూనివర్సిటీ సహాయంతో బెంగళూరు రాష్ట్రం కర్నాటక జిల్లా హొసూరు లోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ డాక్టర్ పిల్లా చంద్రంకు రియాలిటీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అంతర్జాతీయ సాధన పురస్కారాన్ని ప్రదానం చేసింది. హొసూరులోని అకాడమీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ పురస్కారాల ప్రదానోత్సవంలో చంద్రంకు గౌరవ డాక్టరేట్ బిరుదును ప్రదానం చేసి ఘనంగా పౌర సన్మానం చేశారు. 2018 నుండి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి ధ్యేయంగా ఏపీ తెలంగాణలో 3,000 ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పర్యటిస్తూ విద్యార్థినీ, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేరుగానూ, సోషల్ మీడియా ద్వారానూ ఇటు ప్రభుత్వ అధికారులు, అటు ప్రజాప్రతినిధుల దృష్టికి చంద్రం తీసుకు వెళుతున్నారు. చదువు ద్వారానే పేదరికాన్ని నిర్మూలించ వచ్చునే మహానుభావుల స్ఫూర్తిని పాఠశాలల్లో తెలుపుతూ ఉన్నారు. 1983 సంత్సరంలో గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల వ్యవస్థను తీసుకొచ్చిన మహనీయుడు ఎన్టీ రామారావు అప్పటి ప్రభుత్వ సలహాదారు ఎస్సార్ శంకరన్ గొప్పదనం, ఆయన ఔన్నత్యాన్ని అనేక సందర్భాల్లో విద్యార్థిని, విద్యార్థులకు చంద్రం చెబుతూ ఉంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సన్న బియ్యం అన్నాన్నే విద్యార్థులకు అందివ్వాలని 2024 శాసనసభ ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రభుత్వ మంత్రి నారా లోకేష్ కు నేరుగా చంద్రం వివరించారు. లోకేష్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే చంద్రం విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని సన్నబియ్యాన్ని అందించే ఏర్పాటు చేశారు. ఇది చంద్రం రాష్ట్ర వ్యాప్తంగా సాధించిన ఓ ఘనతగా చెప్పొచ్చు. పేద విద్యార్థులు అభివృద్ధి చెందాలంటే తరగతి విద్యా భోధన ఆంగ్ల మాధ్యమంలోనే జరగాలని గత ప్రభుత్వానికి చంద్రం విజ్ఞప్తి చేయగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేసింది. గురుకులాల్లో, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో రద్దు చేసిన కాస్మెటిక్ ఛార్జీలను పునరుద్ధరించాలని, గత ప్రభుత్వం రద్దు చేసినటువంటి దాదాపు 28 దళిత సంక్షేమ పథకాలనూ యథాతథంగా పునరుద్ధరించాలని, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కార్పొరేషన్లకు నిధులను విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫ్రీ బస్సుపాసులను ఇవ్వాలని, ఒకటో తరగతి నుండి పీజీ వరకు ఫ్రీ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని, నానాటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గురుకులాల్లో, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మెస్ చార్జీలను పెంచాలని, ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు వాటర్ ప్లాంట్స్, లైబ్రరీస్, ఫర్నిచర్స్, మెయింటినెన్స్, ప్రతి క్లాస్‌కి టీచర్ వంటి సౌకర్యాలను కల్పించాలని ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) నేషనల్ చైర్మన్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ సౌత్ ఇండియా కోఆర్డినేటర్ డాక్టర్ పిల్లా చంద్రం ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రత్తిపాడు తుఫాను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

## నియోజకవర్గంలో 64 పునరావాస కేంద్రాలు - 33 జేసీబీలు, 48 ట్రాక్టర్లు, 36 జనరేటర్ల ఏర్పాటు - ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెల్లడి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తుఫాన్ ప్రభావం దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాకినాడ జిల్లా ప్రతిపాడు నియోజక వర్గం వ్యాప్తంగా ప్రభుత్వ అధికార యంత్రాంగం విస్తృత పునరావాస ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రభుత్వ పూర్తి సహకారంతో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల ప్రభుత్వ అధికార్ల సమన్వయంతో విస్తృత స్థాయిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు, రక్షణ చర్యలను వేగవంతం చేశారు. వర్షాలు, ఈదురు గాలులు, వరదల ప్రభావం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆయా శాఖల ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముందస్తు జాగ్రత్తల చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై, ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సోమవారం రాత్రి ఒక మీడియా ప్రకటనను విడుదల చేశారు. తుఫాన్ తాకిడికి గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజలకు త్రాగు నీరు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు నిరంతరం అందించేందుకు అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచామని తెలిపారు. విద్యుత్ అంతరాయం సంభవించినా గ్రామాల్లో త్రాగునీటి సరఫరా నిలచి పోకుండా జనరేటర్లు, ట్రాక్టర్లు, జెసిబీలను సిద్ధంగా ఉంచామని చెప్పారు. ప్రత్తిపాడు మండలంలో 25 పునరావాస కేంద్రాలు, 14 జెసిబీలు, 19 ట్రాక్టర్లు, 12 జనరేటర్లు ఏర్పాటు చేశారు. రౌతులపూడి మండలంలో 11 పునరావాస కేంద్రాలు, 8 జెసిబీలు, 5 ట్రాక్టర్లు, 8 జనరేటర్లు సిద్ధం చేశారు. ఏలేశ్వరం మండలంలో 19 పునరావాస కేంద్రాలు, 6 జెసిబీలు,10 ట్రాక్టర్లు, 8 జనరేటర్లు ఏర్పాటు చేశారు. శంఖవరం మండలంలో 9 పునరావాస కేంద్రాలు, 5 జెసిబీలు, 14 ట్రాక్టర్లు, 8 జనరేటర్లు సిద్ధం చేశామని ఎమ్మెల్యే వెల్లడించారు. అదే విధంగా ఏలేరు జలాశయం నుండి 4,500 టీఎంసీల నీటిని ఆయకట్టులోని దిగువ ప్రాంతాలకు విడుదల చేసామని, దీని వల్ల ఏ ప్రమాదమూ సంభవించదనీ, అందువల్ల ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఏలేరు జలాశయం అదనపు నీటి విడుదల పూర్తిగా నీటిపారుదల శాఖ అధికారుల నియంత్రణలోనే ఉందని, ఎలాంటి నష్టం సంభవించదని ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు, సౌకర్యాలను వినియోగించు కోవాలని, అవసరమైతే కంట్రోల్ రూములను సంప్రదించాలని ఆ ప్రకటనలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మండల ప్రజలకు అండగా ఉంటాం..

## గనిశెట్టి వీరేష్ మండల టీడీపీ అధ్యక్షుడు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా కొత్తపేట మండల ప్రజలందరికీ విజ్ఞప్తి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ బయట తిరగరాదు. అధికారులుతో పాటు ప్రజలుకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైన తెలుగుదేశం పార్టీ మరియు కూటమి శ్రేణులు అండగా ఉంటాయి ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే స్థానిక అధికారులకు, కూటమి నాయకులకు సమాచారం ఇవ్వాలి. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా పార్టీ నేతలు అందరూ సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజలకు అండగా నిలవాలని కోరుకుంటున్నాను. అత్యవసర పరిస్థితుల్లో కొత్తపేట రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూం 08855-244299, 85002-38258 నెంబర్లను సంప్రదించాలని కోరుతున్నాము అని తెలియజేశారు.



# ఎర్రకాలువ ప్రవాహం సాధారణ స్థితిలోనే ఉంది

## ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు - తూర్పుగోదావరి జిల్లా సహాయ చర్యల ప్రత్యేక అధికారి కె.కన్నబాబు



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎర్రకాలువ ప్రవాహం ప్రస్తుతం పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తూర్పు గోదావరి జిల్లా సహాయ చర్యల ప్రత్యేక అధికారి, ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో సోమవారం నిడదవోలులో ఆయన పర్యటించి, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్షించారు. రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, జిల్లా మంత్రి కందుల దుర్గేష్ సూచనలతో, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో సమన్వయం చేసుకుంటూ లోతట్టు మరియు ఎర్రకాలువ పరిసర ప్రాంతాల్లో పర్యటనలు నిర్వహించామన్నారు. ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తుందన్న వార్తల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొనగా, ప్రస్తుతం కేవలం 2000 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తోందని, ఇది ప్రమాదకర స్థాయిలో కాదని ఆయన స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం ఆధారంగా ప్రవాహం కొంత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, పరిస్థితి పర్యవేక్షణలో ఉందన్నారు. ఎర్రకాలువ ఉప్పొంగే పరిస్థితి లేదని, నిడదవోలు పట్టణం సురక్షితమని వివరించారు. తుఫాన్ సమయంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, లోతట్టు ప్రాంతాల్లో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సహాయక చర్యలను పర్యవేక్షిస్తానని కె.కన్నబాబు తెలిపారు. జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నామని, పంటల రక్షణ, విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ, తాగునీటి సదుపాయాలు వంటి అంశాలపై యంత్రాంగం 24 గంటలు పనిచేస్తోందని కె. కన్నబాబు తెలిపారు. ఏ సమస్య ఉన్నా వెంటనే స్థానిక అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే తుఫాన్ ప్రభావాన్ని తగ్గించి సాధారణ స్థితిని త్వరగా నెలకొల్పగలమన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాణి సుస్మిత, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మునిసిపల్ కమిషనర్ కృష్ణ వేణి, తహసిల్దార్ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ సిగ్గుమాలిన విధులు..





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్తీకమాస పవిత్ర దినాల్లో రాజమండ్రి నగర పాలక సంస్థ వారు ఎంతో ప్రాముఖ్యత గల పుష్కర ఘాట్‌కు తాళలు వేసి హిందూ ధర్మాన్ని అవమానిస్తున్నారు. వారి మనోభావాలను గాయపరుస్తున్నారు. హిందువుల పవిత్ర దినాలను కలుషితం చేస్తున్నారు. కార్తీకమాస పర్వ దినాల్లో రాజమండ్రి నగర పాలక సంస్థ వారు చేసిన మహా పాపం జాతీయ ద్రోహంగా భావించాలి. ఎందరో భక్తులు పుష్కరఘాట్‌కు తాళాలు వేసిన కారణంగా నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. రాజమండ్రి నగర పాలక సంస్థ చేసిన మహా ద్రోహ చర్య కారణంగా భక్తులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ పాపం రాజమండ్రి పాలకులకు కనపడక పోవటం ఆశ్చర్యంగా వుంది. గోదావరి పోటు మీద ఉన్నప్పటికి అందుకు అవసరమయ్యే పటిష్టమైన భద్రతా చర్యలు, సహాయక చర్యలు నిర్వహించి భక్తుల మనోభావాలకు అండగా నిలవాలి అనే కనీస జ్ఞానం కూడా రాజమండ్రి నగర పాలక సంస్థకు లేకపోవటం దురదృష్టం. రాజమండ్రి నగర పాలక సంస్థ పనితీరు ఎలావుందంటే తుఫాన్ వుంది అంటే సముద్రానికి గోడ కట్టాలి. గోదావరికి తాళాలు వేయాలి అన్నట్టు రాజమండ్రి నగర పాలక సంస్థ పనితీరు కనపడుతుంది. పుష్కర ఘాట్‌కు కార్తీకమాస పవిత్ర దినాల్లో తాళాలు వేసి రాజమండ్రి ప్రతిష్టను రాజమండ్రి నగర పాలక సంస్థ మంటగలిపింది. తక్షణమే తప్పును సరి దిద్దుకునే చర్యలు చేపట్టాలి. హిందువుల మనోభావాల ను రాజమండ్రి నగర పాలక సంస్థ వారు గాయపరిచినట్టు పాకిస్తాన్ వారు కూడా చేయరేమోనని అనిపిస్తుంది. హిందువుల ప్రతీకగా వున్నటు వంటి నరేంద్ర మోదీ పాలనలో జరిగిన ఈ పాపం రాజమండ్రి చరిత్రను వెంటాడుతూనే ఉంటుంది.

### తుఫాను పరిస్థితిపై

# అప్రమత్తంగా ఉన్న జిల్లా యంత్రాంగం : కలెక్టర్ కీర్తి చేకూరి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుత తుఫాను ప్రభావం నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలో పరిస్థితిని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సాయంత్రం క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సగటు వర్షపాతం 8.00 మిల్లీమీటర్లుగా నమోదయిందని, ఇప్పటిబివరకు 105 గ్రామాల్లో 325.09 హెక్టార్ల వ్యవసాయ భూములు ముంపునకు గురైనట్లు తెలిపారు. బిక్కవోలు, రంగంపేట మండలాల్లో నాలుగు ఇళ్లకు స్వల్ప నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థల్లో ఎటువంటి అంతరాయం లేనట్లు, గోదావరి నది వద్ద ఉదయం 6 గంటలకు ఇన్‌ఫ్లో మరియు అవుట్‌ఫ్లో 55,682 క్యూసెక్కులుగా నమోదైందని వివరించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 9 మండలాలు, 303 గ్రామాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని, 12 మండల కంట్రోల్ రూములు, 184 తుఫాను ఆశ్రయాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. 185 తాత్కాలిక సహాయ శిబిరాలు గుర్తించబడి, ఒక ఎన్‌డిఆర్ఎఫ్, ఒక ఎస్‌డిఆర్ఎఫ్ బృందం మోహరించబడిందని వివరించారు. తాగునీటి సరఫరా, ఆహార ప్యాకెట్ల పంపిణీకి తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, జిల్లా కంట్రోల్ రూమ్ 24ఐ7 విధుల్లో కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అత్యవసర పరిస్థితుల్లో 112, 1070 లేదా 1800 425 0101 నంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన కొత్తపేట ఆర్డీవో



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేటలో పునరావస కేంద్రాలను పరిశీలించిన కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ సోమవారం పర్యటించారు. మండల పరిధిలోని వక్కలంక గ్రామంలో మంద తుఫాను దృష్ట్యా ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆర్డిఓ ఆదేశించారు. వృద్ధులు, చిన్నపిల్లలు ,గర్భిణీలు బాలింతలు వంటి వారు ఇళ్ల నుండి బయటకు రాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి తెలిపారు.ఆయన వెంట గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రేవతి పెదబాబు, తాసిల్దార్ చినబాబు, రెవిన్యూ అధికారి ఏడుకొండలు, వీఆర్వో సచివాలయం సిబ్బంది ఉన్నారు.

### మంత్రి కందుల దుర్గేష్

# ముంబయి పర్యాటక పర్యటన రద్దు..

**- ముంబయిలోని గోరేగావ్‌లో ఇండియా మారిటైమ్ వీక్-2025కి ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న మంత్రి దుర్గేష్**

**- మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తిరిగి రాజమండ్రికి పయనం..**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ముంబయి పర్యాటక పర్యటన రద్దయింది. ముందుగా నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 27 నుండి 31వరకు ముంబయి గోరేగావ్ లోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్ లో భారత ప్రభుత్వ ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో జరుగనున్న ఇండియా మారిటైమ్ వీక్ (ఐఎమ్ డబ్ల్యూ)-2025 సమావేశానికి హాజరయ్యేందుకు మంత్రి కందుల దుర్గేష్ ముంబయి బయలుదేరారు. సోమవారం హైదరాబాద్ చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో తన పర్యాటక ప్రయాణాన్ని రద్దు చేసుకొని హైదరాబాద్ నుండి రాజమహేంద్రవరం తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం నుండి మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. క్రూయిజ్, ప్యాసింజర్ ఎకానమీ, ప్రపంచ ఉత్తమ పద్ధతులు, పర్యాటక ప్రాంతాలను పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే అంశాలు, పోర్ట్ ఆధారిత పర్యాటకం, డిజిటలైజేషన్, రివర్ క్రూయిజ్, సుస్థిర ప్రయణీకుల ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై జరిగే ప్రత్యేక చర్చలో మంత్రి దుర్గేష్ పాల్గొనాల్సి ఉంది.. కానీ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు అండగా నిలిచేందుకు తిరిగి రాజమహేంద్రవరం చేరుకోనున్నారు. ఈ కార్యక్రమానికి నౌకాశ్రయాలు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్విత్య శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రెవెన్యూవిభాగం, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, పర్యాటక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు మరియు ప్రముఖ గ్లోబల్ క్రూయిజ్ లైన్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు హాజరుకానున్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు అక్టోబర్ 31 ఆఖరు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్చి 2026లో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే జనరల్ మరియు వృత్తి (ఒకేషనల్) విభాగాల మొదటి, రెండవ సంవత్సర విద్యార్థులు రెగ్యులర్ మరియు ఫెయిల్ అయిన (ప్రైవేట్) అభ్యర్థులు తమ పరీక్ష రుసుములు చెల్లించాల్సిన గడువు తేదీలు ప్రకటించబడ్డాయి. పరీక్ష రుసుము చెల్లించడానికి చివరి తేదీ 31-10-2025 వరకు జరిమానా లేకుండా చెల్లించవచ్చు. జరిమానాతో (రూ.1000/-) చెల్లించడానికి గడువు 06-11-2025 వరకు కొనసాగుతుంది. ఈ మేరకు అన్ని కళాశాలల ప్రిన్సిపల్‌లకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు తెలియజేయబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్.ఎస్.వి.ఎల్. నరసింహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గడువు లోపు రుసుములు చెల్లించి పరీక్షలకు అర్హత పొందాలని సూచించారు.

# మొంథా తుఫాను -ఉద్యాన పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావం గురించి మండల గ్రామ స్థాయి ఉద్యానవన శాఖ సిబ్బంది ద్వారా రైతులకు ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారి పి.రిని వివరించడం జరిగింది. సీతానగరం మండలంలో 2227 ఎకరాలు ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ప్రధానంగా అరటి, మరియు కూరగాయలు 700 ఎకరాల సాగులో ఉన్నాయి. అధిక వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలు కూడా వీచే అవకాశం ఉన్నందువల్ల సమస్యాత్మకమైన ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి,కూరగాయలు మరియు పూల రైతులకు ఈ తుఫాను ప్రభావం వల్ల నష్టాల బారిన పడకుండా పంటలు కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో వివరించారు.

### జోరు వానలోనూ

# వైకాపా కోటి సంతకాల సేకరణ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జోరు వానలోను కోటి సంతకాల సేకరణ జోరుగా సాగిందని రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం హోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్డీఏ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైకాపా నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోటిగా సంతకాల సేకరణ జోరుగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైకాపా నాయకులు మాట్లాడుతూ వైకాపా పాలనలో జగన్ ఎంతో కష్టపడి మెడికల్ కాలేజీలు శాంక్షన్ చేయిస్తే, బాబు వాటిని నిస్సుగ్గుగా ప్రైవేట్ పరం చేస్తున్నారని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. రాజానగరం నియోజకవర్గంలోని సీతారాంపురం, రాజానగరం, దివాన్ చెరువు, శ్రీరాంపురం, ముక్కినాడ, రాజవరం, కోరుకొండ, శ్రీరంగపట్నం, నిడిగట్ల, మధురపూడి, మునగాల, పురుషోత్తమపట్నం, చిన్నకొండెపూడి, రాపాక,బొబ్బిలంక గ్రామాల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాన్ని తెలియజేస్తూ కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ పార్టీని వీడిన అంజూరి శ్రీనివాస్ చౌదరి

## పార్టీ కార్యక్రమాలలో పూల వర్షాలతో జోష్ నింపే వ్యక్తిగా గుర్తింపు...



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు అత్యంత సన్నిహితుడిగా, రేవు శ్రీను కు ముఖ్య అనుచరుడిగా వైయస్సార్ పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు అంజూరి శ్రీనివాస్ చౌదరి.అయన తన వ్యక్తిగత కారణాలు దృష్ట్యా నేటి నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడినట్లు స్థానిక విలేకరులకు సోమవారం తెలిపారు.అతి తక్కువ సమయంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నాయకుడిగా మున్సిపాలిటీ ఎన్నికల్లో 12 వార్డు గెలుపు కోసం కీలకపాత్ర పోషించాడు.ప్రతి గడపగడపకు తిరిగి తోట త్రిమూర్తులు విజయ కోసం రాత్రి పగలు తారతమ్యం లేకుండా అహర్నిశలు శ్రమించిన వ్యక్తిగా పేరు పొందాడు. పార్టీ కార్యక్రమాలలో సొంత నిధులతో పూల వర్షం కురిపిస్తూ తనదైన గుర్తింపు తెచ్చుకున్న అంజూరి శ్రీనివాస్ చౌదరి. సహాయం అని కోరి వచ్చిన ప్రజలకు తనదైన శైలిలో చేయూతగా అయ్యి ప్రజలందరి మన్ననాలు పొందాడు.ఆయన వైయస్సార్ పార్టీ నుండి తప్పుకుంటునట్లు తెలిసిన తోటి వైసిపి నాయకులు, కార్యకర్తలు విచారం వ్యక్తం చేశారు.

### అధికార యంత్రాంగంతో పాటు

# ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో ఆయన నివాసంలో మాట్లాడుతూ బంగాళాఖాతంలో మొంథా తుఫాన్ ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు చేసిందని, అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. ఆస్తి, ప్రాణ, పశు ,పంట నష్టం జరగకుండా అధికార యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తీర ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని అన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికార యంత్రాంగం అంతా పనిచేసే ప్రదేశాల్లోనే ఉండేలా చూడాలని ఉన్నతాధికారులను కోరారు. కార్తీకమాసం సందర్భంగా సముద్ర తీర ప్రాంతాలకు విహార యాత్రలకు వెళ్ళేవారు వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆలమూరులో తుఫాను సహాయక చర్యలు

## పునరావాస కేంద్రాలు ఏర్పాటు





**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధిలో మొంథా తుఫాన్ కు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలమూరు మండలంలో తగిన సహాయక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో ఎ. రాజు తెలిపారు. ఆయన సోమవారం మండలం లోని పలు గ్రామాలను పర్యటించి అక్కడ పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఆలమూరు గర్ల్స్ హై స్కూల్, బీసీ హాస్టల్,కాపు కళ్యాణ మండపం బడుగువా లంక యుపి స్కూల్, చెముడులంక శ్రీకృష్ణదేవ రాయ కళ్యాణ మండపం వంటి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.శిధిలమైన ఇళ్లు, రేకుల షెడ్లు, తాటాకు ఇళ్లల్లో నివసించే వారందరినీ ముందు జాగ్రత్త చర్యగా ఈ పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేసామన్నారు. అలాగే ప్రతి గ్రామంలోనూ 24 గంటలు హెల్ప్ లైన్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఆ హెల్ప్ లైన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్తు అంతరాయం ఏర్పడితే తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత వాటర్ ట్యాంకుల వద్ద జనరేటర్లు ను కూడా సిద్ధం చేసినట్లు ఎంపీడీవో రాజు వివరించారు. ఇప్పటికే ఈ తుపాను తీవ్రత పై ప్రతి గ్రామంలోనూ దండోరాలు, మైకులు ద్వారా హెచ్చరికలు జారీ చేసినట్లు వివరించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రత్యూష పలు శాఖల అధికారులు, పలువురు ఉన్నారు.

# అమలాపురం పవర్ కిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం రాజమండ్రిలో మారుతి మార్షల్ ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో ఖేలో ఇండియా వారు నిర్వహించిన అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ 2025- 26 రాష్ట్రస్థాయి ఎంపికా పోటీలలో అమలాపురం పవర్ కిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. ఈ పోటీలలో సుమారు150 మంది పాల్గొనగా అమలాపురం నుండి ఐదుగురు విద్యార్థినిలు అడపా రవి శంకరి-48కేజీ, మోక కరుణ మిత్ర -28 కేజీ, బొలిశెట్టి యసస్విని-56కేజీ, పిల్లి ధన్య శ్రీ-36 కేజీ, కుంచె లెనిన్ - 56 స్వర్ణ పతకాలు గెలుపొంది వచ్చేనెల విశాఖపట్నంలో జరిగే సౌత్ ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ చిక్కం సురేష్ తెలిపారు. పథకాలు గెలుపొందిన విజేతలను పలువురు అభినందించారు.

# నదురుబాధలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, నదురుబాధ గ్రామంలో గ్రామ సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు గానూ గ్రామసభ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 51 పనులకు గ్రామసభ లో ఆమోదం లభించింది. ఈ గ్రామసభ కు పంచాయతీ సెక్రటరీ వి.జనార్ధన్, ఎంపిటీసి ఉండవల్లి సుబ్బారాయుడు, ఎపిఓ సుధారాణి, గ్రామ వార్డు మెంబర్లు కెల్లాఅప్పారావు, రొంగల బంగారయ్య, గ్రామ టిడిపి నాయకులు ఉప్పలపాటి చందర్ రావు, గ్రామ జనసేన అధ్యక్షులు మిద్దిపాటి సూర్యనారాయణ, గ్రామ ఉపాధి వేతనదారులు తదితరులు హాజరయ్యారు.



# శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

## మండల పరిధిలోని గ్రామాలలో ఉన్న శివాలయాలు

**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలన్నీ భక్త జనంతో పోటెత్తాయి. ఎక్కడ చూసినా 'ఓం నమఃశివాయ', 'హరహర మహాదేవ', 'శంభో శంకర' అంటూ మారుమోగిన శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. భక్తులు అపారమైన భక్తి శ్రద్ధలతో పరమేశ్వరుడిని పూజించారు.దేవాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు.కార్తీక సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో వేద మంత్రాల నడుమ విశేష అభిషేకాలు జరిపారు.

### పునరావాస కేంద్రాలలో

# ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో అఖిల

## రాయవరం హైస్కూల్‌లో 219 మందికి ఆశ్రయం - సోమేశ్వరం, మాచవరంలో 95 మంది తరలింపు





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను తీవ్రత ఎక్కువగా ఉందనే వాతావరణం శాఖ హెచ్చరికలతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు ప్రాణం నష్టం సంభవించకూడదనే ఆలోచనతో ఇచ్చిన ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా 35 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, పూరిపాకలు,బలహీన గృహాల లో నివాసం ఉంటున్న వారిని, ఇటుక బట్టీ లలో పనిచేసే అంతర్రాష్ట్ర కూలీలను స్థానిక నాయకులతో కలిసి అధికారులు సోమవారం పునరావాస కేంద్రాలకు తరలించారు. సోమేశ్వరం గ్రామంలో పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న వారిని రామచంద్రపురం ఆర్డిఓ డి.అఖిల సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పునరావాస కేంద్రం వద్ద విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జనరేటర్ ఏర్పాటు చేయాలని వివరించారు. బాధితులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. కాగా గ్రామంలో తుఫాను ప్రభావంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసరి సత్యనారాయణ సచివాలయం ఉద్యోగులను సమన్వయం చేసుకోగా, స్థానిక జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు శాకా నాగేంద్ర, పార్టీ కార్యదర్శి మణి ప్రసాద్ లతో కలిసి యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులతో మురుగు నీరు సక్రమంగా పారేలా ఏర్పాట్లను సమీక్షించారు. విద్యుత్, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్దంగా ఉన్నారని సోమేశ్వరం,మాచవరం పునరావాస కేంద్రాలలో సుమారుగా 95 మంది ఆశ్రయం పొందుతున్నారని కూటమి నాయకులు శాఖా నాగేంద్ర తెలిపారు.

**రాయవరంలో పునరావాస కేంద్రం ఏర్పాటు**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాను తీవ్రత ప్రభావం చూపనుందనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రమైన రాయవరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు సోమవారం 219 మందిని తరలించినట్లు రాయవరం విఆర్వో శైలజ, వి.సావరం విఆర్వో సుబ్బారావు చౌదరి లు తెలిపారు. రాయవరం శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి రాయవరం,వి.సావరం గ్రామాలలోని ఇటుక బట్టీ లలో పనిచేసే అంతర్రాష్ట్ర, స్థానిక కూలీలను తరలించారు. ఈ సందర్భంగా విఆర్వో శైలజ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సచివాలయ ఉద్యోగులుతో కలిసి అన్ని ఏర్పాట్లు చేసామని త్రాగునీరు వసతులను నిత్యం షిఫ్ట్‌ల వైజ్‌గా అందుబాటులో ఉంటామన్నారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు జనరేటర్‌ను ఏర్పాటు చేసామని, వైద్య సౌకర్యాలను సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని పేర్కొంటూ రాయవరం, వి.సావరం గ్రామాల నుండి 105 మంది పురుషులు, 65 మంది స్త్రీలు, 49 మంది పిల్లలు పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు.





# విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించాలి

## బాలభట ఉద్యమాన్ని ఉధృతం చేయాలి



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది భారత్ స్కౌట్ అండ్ గైడ్స్‌ను విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి, స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ డాక్టర్ షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్ మాస్టర్స్ ట్రైనింగ్‌ను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో డాక్టర్ సలీం బాషా మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడానికి బాల భట ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్‌ను బలోపేతం చేసేందుకు సమగ్ర శిక్షా ద్వారా ఏటా నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. దేశ రక్షణలో స్కౌట్ అండ్ గైడ్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ట్రైనింగ్ పొందిన ప్రతి స్కౌట్ టీచర్ క్షేత్ర స్థాయిలో స్కౌట్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ పి.రాంబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల నుంచి 77 మంది స్కౌట్ టీచర్లు ఈ నెల 23 నుంచి ట్రెనింగ్ పొందుతున్నట్లు తెలిపారు. వచ్చే నెల 3వ తేది నుంచి మూడు జిల్లాలకు చెందిన గైడ్ కెప్టెన్స్‌కు రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు బేసిక్, అడ్వాన్స్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో బేసిక్, అడ్వాన్స్ లీడర్ ఆఫ్ కోర్స్ డీఎల్ నారాయణ, బి.శివనాగిరెడ్డి, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల స్కౌట్ అండ్ గైడ్ సెక్రటరీలు జె.రాజ్‌కుమార్, ఎంవీవీ సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ బి.కల్పనలు మాట్లాడారు. స్కౌట్ అండ్ గైడ్స్ ప్రాధాన్యత గురించి వివరించారు. ఐదు రోజుల పాటు శిక్షణనిచ్చిన ట్రైనీస్ బ్రహ్మేశ్వరరావు, బీవీ శ్రీనివాస్, కట్టా కృష్ణప్రసాద్, జేఎన్ఎస్ గోపాలకృష్ణ, షేక్ అజారుద్దీన్, వై.నాగేశ్వరరావు, జి.సుబ్బరాజులను డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా అభినందించారు. స్కౌట్ మాస్టర్స్ డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషాను సత్కరించారు.

# 12 రాష్ట్రాలు, యూటీల్లో 'సర్'

న్యూఢిల్లీ



రెండో దశలో దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ)లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–సర్)ను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించనున్నదని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ సోమవారం ప్రకటించారు. నవంబర్ 4 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్‌ని నిర్వహించనున్నట్లు విలేకరుల సమావేశంలో ఆయన ప్రకటించారు. వీటిలో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అస్సాంలో ఓటరు జాబితాల సవరణను విడిగా ప్రకటిస్తామని సీఈసీ తెలిపారు. 'సర్'ని విజయవంతం చేసినందుకు బీహార్‌కు చెందిన 7.5 కోట్ల మంది ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాలకు చెందిన ఎన్నికల అధికారులతో సమావేశమైన ఈసీ సర్ ప్రక్రియ గురించి సమగ్రంగా చర్చించిందని సీఈసీ తెలిపారు. 12 రాష్ట్రాలు, యూటీలకు చెందిన 51 కోట్ల మంది ఓటర్లకు సంబంధించిన ఇంటింటి సర్వే నవంబర్ 4న ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. డిసెంబర్ 9న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, 2026 ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని సీఈసీ తెలిపారు.

**ఇంటింటి సర్వే తప్పనిసరి**

బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ) విశిష్ట ఎన్యూమరేషన్ ఫారాలతో ప్రతి ఇంటిని సందర్శించి ప్రస్తుత ఓటరు జాబితా నుంచి అవసరమైన వివరాలు సేకరిస్తారని సీఈసీ చెప్పారు. బీఎల్‌ఓలు ఫారాలు అందచేసిన తర్వాత ఓటరు జాబితా నుంచి తమ వివరాలను ఓటర్లు తనిఖీ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలలో తమ పేర్లను ఓటర్లు 2003 ఓటరు జాబితాలోని తమ పేర్లతో సరిపోల్చుకోవచ్చని ఆయన వివరించారు. 2003 జాబితాలో తమ పేర్లు లేదా తమ తల్లిదండ్రుల పేర్లు ఉన్న వారు అదనపు పత్రాలు ఏవీ సమర్పించవలసిన అవసరం లేదని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. 2002–2004 ఎస్ఐఆర్ కాలానికి చెందిన ఓటరు జాబితాలను ఈసీఐకి చెందిన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, ఓటరు జాబితాలోని తమ పేర్లను నేరుగా చూసుకోవచ్చని కూడా ఆయన తెలిపారు. పారదర్శకతను పాటించేందుకు ముఖ్య ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు బుధవారం కల్లా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమై 'సర్' ప్రక్రియ గురించి వివరించాలని ఆదేశించారు.

**బీజేపీతో ఈసీ కుమ్మక్కు: విపక్షాలు**

'సర్' పేరుతో 12 రాష్ట్రాలలో ఓటు చోరీ ఆట ఆడేందుకు మోదీ ప్రభుత్వంతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కయ్యిందని ప్రతిపక్ష కాంగ్రెస్ సోమవారం ఆరోపించింది. బీహార్‌లో 69 లక్షల ఓటర్ల తొలగింపునకు దారితీసిన సర్‌ని ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించి అదే ఓటరు జాబితా మోసాలకు పాల్పడేందుకు కుట్రపన్నారని ఆరోపించింది. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ పెండింగ్‌లో ఉండగా దేశవ్యాప్తంగా సర్‌ని అమలు చేయడానికి ఎన్నికల కమిషన్ ఎందుకు తొందరపడుతోందని నిలదీసింది. అస్సాంలో సర్‌ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని టీఎంసీ పేర్కొన్నది.

# మా ఆదేశాలపై ఇంత నిర్లక్ష్యమా?

న్యూఢిల్లీ



వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సుప్రీంకోర్టు మండిపడింది. వాటిని ఎక్కడికక్కడ పట్టుకుని.. స్టెరిలైజ్ ఇంజక్షన్లు చేసి విడిచిపెట్టాలని, దీనిపై అఫిడవిట్లు దాఖలుచేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)లకు ఆగస్టు 22న ఆదేశాలు జారీచేస్తే.. తమిళనాడు, బెంగాల్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ తప్ప మిగతా రాష్ట్రాలు, యూటీలేవీ ఇంతవరకు అఫిడవిట్లు వేయకపోవడాన్ని ఆక్షేపించింది. ఆ మిగతా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులంతా వచ్చే నెల 3వ తేదీన జరిగే విచారణ సందర్భంగా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. జంతువుల జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనలకు అనుగుణంగా కుక్కల షెల్టర్లు, అందుబాటులో ఉన్న వెటర్నరీ డాక్టర్లు, కుక్కలు పట్టే సిబ్బంది, ప్రత్యేక వాహనాలు, బోన్లు తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్రాలు, యూటీల పురపాలక అధికారులను ఆగస్టు 22న ఆదేశించింది. ఈ ఆదేశాలు జారీచేశాక కూడా పలు చోట్ల వీధికుక్కల దాడులు జరిగాయని తెలిపింది. 'గత నెలలో మహారాష్ట్రలోని పుణేలో ఓ చిన్నారిపై దాడిచేశాయి. అంతకు కొన్ని రోజుల ముందు భండారా జిల్లాఓ 20 కుక్కలు ఓ అమ్మాయిపై దాడిచేశాయి. గత వారం కేరళలో కన్నూర్ జిల్లాలో వీధి కుక్కలపై వీధినాటకం ప్రదర్శిస్తున్న వ్యక్తిపైనే దాడిచేశాయి. యూపీలోని లఖ్‌నవూలో ఒకే కుటుంబంలో ముగ్గురిని కరిచాయి. గత 48 గంటల్లో తెలంగాణలోని వరంగల్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అయినా రాష్ట్రప్రభుత్వాల నుంచి స్పందన లేదు. దేశంలో నిరంతరం పిల్లలు, వృద్ధులు, మహిళలు.. ఇలా అందరిపై కుక్కలు దాడులు చేస్తుంటే.. విదేశాల్లో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మన దేశాన్ని అంతర్జాతీయంగా చెడుగా చిత్రిస్తున్నారు. ఆగస్టు 22న మేమిచ్చిన ఆదేశాలపై విస్తృతంగా ప్రచారం జరిగింది. రెండు నెలలు గడువిచ్చినా స్పందన లేదు. అధికారులు దినపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియాలో చూడడం లేదా? పేరుపేరునా నోటీసులివ్వాలా' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం ఆయా రాష్ట్రాల తరఫు న్యాయవాదులు సైతం విచారణ సమయంలో లేకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 3వ తేదీన సీఎస‌లు తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వకుంటే.. బహిరంగంగా కోర్టు నిర్వహిస్తామని హెచ్చరించింది. 3న అఫిడవిట్ వేస్తామని ఢిల్లీ ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలుపగా.. సీఎస్ తమ ముందు హాజరు కావలసిందేనని తేల్చిచెప్పింది. 'ఆయన అఫిడవిట్ వేస్తే వేయనివ్వండి. కానీ మా ఆదేశాలపై ఎందుకు స్పందించలేదో వివరణ ఇవ్వాల్సిందే. ఆయన రాకుంటే ఖర్చులు విధించడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయి' అని పేర్కొంది. కోర్టు ఆదేశాలు వీధికుక్కల పాలిట మరీ క్రూరంగా ఉన్నాయని ఓ న్యాయవాది ప్రస్తావించగా.. మనుషుల పట్ల క్రౌర్యం గురించి ఏం చెబుతారని ధర్మాసనం నిలదీసింది.

## డిజిటల్ అరెస్ట్ అత్యంత భయంకరమైన ముప్పు



దిల్లీ: డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

## రష్యా నుంచి చమురు కొనుగోలు.. ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం



రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒక్కో దేశంతో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నీతులు బోధించేవారే వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకం విధిస్తున్న విషయం విదితమే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ

పదవీ విరమణ చేయబోతున్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తన వారసుని పేరును కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. తన తర్వాత సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ జడ్జిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్‌ను తదుపరి సీజేఐగా నియమించాలని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు తెలిపారు. దీంతో 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ వచ్చే నెల 24న ప్రమాణ స్వీకారం చేసే అవకాశం కనిపిస్తున్నది. జస్టిస్ గవాయ్ వచ్చే నెల 23న పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2019 మే 24న నియమితులయ్యారు. సీజేఐ పదవిని చేపడితే దాదాపు 15 నెలలపాటు, అంటే, 2027 ఫిబ్రవరి 9 వరకు ఆ పదవిలో కొనసాగుతారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 65 సంవత్సరాలు.

**సుదీర్ఘ అనుభవం, కీలక తీర్పులు**

జస్టిస్ సూర్యకాంత్ హర్యానాలోని హిసార్ జిల్లాలో 1962 ఫిబ్రవరి 10న మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన దాదాపు రెండు దశాబ్దాలపాటు న్యాయమూర్తిగా అనుభవం గడించారు. అధికరణ 370 రద్దు, వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, స్త్రీ, పురుష సమానత్వం వంటి అంశాల్లో మైలురాళ్ల వంటి తీర్పులిచ్చారు. వలస పాలన కాలంనాటి రాజద్రోహం చట్టాన్ని సస్పెండ్ చేసిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఉన్నారు. ఈ చట్టాన్ని ప్రభుత్వం సమీక్షించే వరకు దీని కింద కొత్త కేసులను నమోదు చేయవద్దని ఆదేశించారు. బీహార్‌లో ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన 65 లక్షల పేర్లను, వివరాలను వెల్లడించాలని ఈసీని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఈ ఆదేశాలిచ్చారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా అన్ని బార్ అసోసియేషన్లలోనూ మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలని ఆదేశించారు. రక్షణ దళాలకు వన్ ర్యాంక్–వన్ పెన్షన్‌ను సమర్థించారు. ఇది రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటయ్యేదేనని తెలిపారు. సాయుధ దళాల్లో పర్మనెంట్ కమిషన్‌లో సమానత్వం కావాలని మహిళా అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపారు. 1967నాటి ఆలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం తీర్పును రద్దు చేసిన ఏడుగురు సభ్యుల ధర్మాసనంలో సూర్యకాంత్ కూడా ఉన్నారు. ఈ విశ్వవిద్యాలయానికి ఉన్న మైనారిటీ హోదాపై పునఃపరిశీలన చేసేందుకు ఈ తీర్పు బాటలు తెరిచింది. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలో కూడా ఆయన ఉన్నారు. చట్ట వ్యతిరేక నిఘా ఆరోపణలపై దర్యాప్తు కోసం సైబర్ నిపుణులతో ఓ కమిటీని ఈ ధర్మాసనం ఏర్పాటు చేసింది. దేశ భద్రత ముసుగులో రాజ్యం స్వేచ్ఛగా వ్యవహరించజాలదని చెప్పింది.

## ప్రధాని మోదీపై హత్యకు కుట్ర? పుతిన్ రక్షించాడా?



భారత ప్రధాని నరేంద్ర మోదీపై బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన ఓ భారీ హత్య కుట్రను భారత, రష్యా నిఘా సంస్థలు సంయుక్తంగా అడ్డుకున్నాయని ఓ సంచలన కథనం వెలుగులోకి వచ్చింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా అమెరికాకు చెందిన ఓ స్పెషల్ ఫోర్సెస్ అధికారి అనుమానాస్పద స్థితిలో మరణించడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అందించిన అత్యంత కీలక సమాచారంతో ఈ కుట్రను ఛేదించినట్లు తెలుస్తోంది. మలయాళ మీడియా సంస్థ 'మాతృభూమి', రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మౌత్ పీస్ ఆర్గనైజర్ కథనాల ప్రకారం, ఆగస్టు 31వ తేదీ రాత్రి ఢాకాలోని ఓ విలాసవంతమైన హోటల్‌లో అమెరికా స్పెషల్ ఫోర్సెస్ అధికారి టెరెన్స్ అర్వెల్ జాక్సన్ మృతదేహం లభ్యమైంది. బంగ్లాదేశ్ సైన్యానికి శిక్షణ ఇవ్వడానికి వచ్చానని అధికారికంగా చెప్పినప్పటికీ, అతని ప్రొఫైల్ నిఘా వర్గాలలో అనుమానాలు రేకెత్తించింది. అంతర్జాతీయంగా రహస్య ఆపరేషన్లలో అనుభవమున్న అంత సీనియర్ అధికారి సాధారణ శిక్షణ కోసం రావడం అసాధారణం. అదే సమయంలో భారత నాయకత్వంపై దాడికి సంబంధించి నిఘా వర్గాలకు కొన్ని సంకేతాలు అందాయి. దీంతో జాక్సన్ పర్యటన వెనుక మరో ఉద్దేశం ఉందని భావించారు.

**పుతిన్ రక్షించాడా?**

ఇదే సమయంలో చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సమావేశం ముగిశాక రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీని తన అత్యంత భద్రత కలిగిన 'ఆరస్ లిమోసిన్' కారులోకి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇద్దరూ సుమారు 45 నిమిషాల పాటు ఎలాంటి సహాయకులు లేకుండా రహస్యంగా చర్చించుకున్నారు. ఈ కారులోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ సిగ్నల్స్ చొరబడలేవు. సంభాషణలను రికార్డ్ చేయడం గానీ, ట్రాక్ చేయడం గానీ అసాధ్యం. మోదీపై జరుగుతున్న హత్య కుట్రకు సంబంధించిన కీలక సమాచారాన్ని పుతిన్ ఈ భేటీలోనే పంచుకున్నారని సమాచారం. భారత నిఘా సంస్థ 'రా', రష్యాకు చెందిన ఫారిన్ ఇంటెలిజెన్స్ సర్వీస్ 'ఎస్‌వీఆర్' కొద్దిరోజులుగా ఢాకా కేంద్రంగా జరుగుతున్న అనుమానాస్పద కమ్యూనికేషన్లను పసిగట్టాయి. పుతిన్ హెచ్చరికతో అప్రమత్తమైన ఈ రెండు సంస్థలు సంయుక్తంగా రంగంలోకి దిగాయి. ఆగస్టు 30 రాత్రికే ముప్పును గుర్తించి, నిందితుల కదలికలపై నిఘా పెట్టి కుట్రను అమలు కాకముందే నిర్వీర్యం చేశాయి. ఆ మరుసటి రోజే జాక్సన్ అనుమానాస్పద స్థితిలో మరణించడం గమనార్హం.

**మోదీ వ్యాఖ్యల అర్థమేంటి?**

చైనా పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత, ప్రధాని మోదీ 'సమీకాన్ ఇండియా' సమావేశంలో పాల్గొన్నారు. ఆ సమయంలో చప్పట్లు కొడుతున్న సభికులను ఉద్దేశించి, "నేను చైనాకు వెళ్లినందుకు చప్పట్లు కొడుతున్నారా? లేక తిరిగొచ్చినందుకా?" అని నవ్వుతూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారని ఆ కథనం గుర్తుచేసింది. తాను ఒక పెను ప్రమాదం నుంచి బయటపడ్డాననే విషయాన్ని ప్రధాని పరోక్షంగా ఆ వ్యాఖ్యల ద్వారా చెప్పారని కథనం విశ్లేషించింది. ప్రస్తుతం ఈ అంశాలు సోషల్ మీడియాలో, పలు డిజిటల్ వేదికలపై తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానం, ముఖ్యంగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం, ఉక్రెయిన్ విషయంలో తటస్థంగా ఉండటం వంటివి అమెరికాకు తీవ్ర అసహనాన్ని కలిగిస్తున్నాయని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తమకు అనుకూలంగా లేని ప్రభుత్వాలను కూల్చడంలో అమెరికాకు చరిత్ర ఉందని, ఈ నేపథ్యంలోనే ఈ కుట్ర జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

# బిజినెస్

## వొడాఫోన్ ఐడియాకు సుప్రీంలో భారీ ఊరట




సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిల లెక్కింపు వ్యవహారంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2016-17 వరకు బకాయిల కోసం టెలికాం విభాగం (డాట్) ఇచ్చిన అదనపు పన్ను డిమాండ్‌లపై కంపెనీ చేస్తోన్న అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. డాట్ తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ వొడాఫోన్ ఐడియా వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2016-17 కాలానికి అదనపు ఏజీఆర్ చెల్లించాల్సిందిగా డాట్ ఇటీవల కంపెనీకి నోటీసులు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ.. రూ.5,606 కోట్ల అదనపు పన్నును డిమాండ్ చేసింది. అంతేగాక, 2018-19 వరకు ఐడియా సెల్యులార్ గ్రూప్, వొడాఫోన్ ఐడియా కోసం లైసెన్సు ఫీజు బకాయిల మొత్తాన్ని కూడా సవరించింది. దీంతో కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏజీఆర్ బకాయిలపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు పరిధిని దాటి డాట్ పన్ను డిమాండ్ చేస్తోందని కంపెనీ వాదించింది. తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించింది. ఈ విచారణ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. "వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49శాతం వాటా ఉంది. దాదాపు 20 కోట్ల మంది వినియోగదారులు ఈ సేవలపై ఆధారపడ్డారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు.. కంపెనీ లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రం సుముఖంగా ఉంది" అని కోర్టుకు తెలిపారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. "ఇది విధానపరమైన అంశం. ఇందులో కేంద్రాన్ని అడ్డుకునేందుకు ఎలాంటి కారణం కన్పించట్లేదు. అందువల్ల కంపెనీ వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టేస్తున్నాం" అని వెల్లడించింది. వొడాఫోన్ ఐడియా లేవనెత్తిన అంశాలను పరిశీలించేందుకు కేంద్రానికి అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామాలతో నేడు స్టాక్ మార్కెట్లలో వొడాఫోన్ ఐడియా షేర్లు రాణించాయి.

## పసిడి పరుగులకు బ్రేక్..



కొండెక్కిన బంగారం ధరలు ప్రస్తుతం కొండదిగుతున్నాయి. గతవారంలో ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పుత్తడి తిరోగమనబాట పట్టింది. నేడు కూడా బంగారం ధరలు భారీగా తగ్గాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో తులంపై రూ.1,440 తగ్గింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,24,480కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,050 తగ్గి రూ.1,14,100కి చేరింది.అటు వెండి ధరలు కూడా బంగారంతో సమానంగా దిగొచ్చాయి. పది రోజుల కిందట కిలో వెండి ధర రూ.2 లక్షలకు చేరువైన విషయం తెలిసిందే. ఇప్పుడు కిలో వెండి రూ.1.50 లక్షల మధ్య ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడం, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటంతో దేశీయంగా ధరలు దిగొస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా, పది రోజుల క్రితం తులం బంగారం ఎన్నడూ లేని విధంగా రూ.1.35 లక్షలు దాటిన విషయం తెలిసిందే. దీంతో వినియోగదారులు పుత్తడి కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు బంగారం ధరలు తగ్గుతుండటంతో కొనుగోలుదారుల్లో ఉత్సాహం నెలకొంది. అటు రేట్లు తగ్గడంపై పెట్టుబడిదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

# అక్టోబర్‌లో రికార్డు స్థాయికి చేరిన టూవీలర్ రిజిస్ట్రేషన్లు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0, పండగ సీజన్ డిమాండ్ కలిసి రావడంతో ద్విచక్ర వాహన మార్కెట్ కొత్త ఉత్సాహంతో దూసుకెళుతోంది. అక్టోబరు నెలలో ఏకంగా 18.5 లక్షల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి.ఈ ఏడాదిలో ఒక నెలలో నమోదైన అత్యధిక రిజిస్ట్రేషన్లు ఇవే కావడం విశేషం. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం ఈ విషయం వెల్లడైంది.ఇటీవల జీఎస్టీ 2.0 విధానంలో భాగంగా 350సీసీ ఇంజిన్ సామర్థ్యం వరకు ఉన్న మోటార్‌సైకిళ్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి ప్రభుత్వం తగ్గించింది. దీంతో వాహనాల ధరలు గణనీయంగా తగ్గి, కొనుగోలుదారుల్లో ఆసక్తి పెరిగింది. దీనికి తోడు దీపావళి పండగ సీజన్ కావడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు ఊపందుకున్నాయి.సెప్టెంబరు నెల నుంచే టూవీలర్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబరులో కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా అయ్యే వాహనాల సంఖ్య 9 శాతం పెరిగి, 2 మిలియన్ల మార్కును దాటింది. దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ సెప్టెంబర్‌లో 5 శాతం వృద్ధితో 6,47,582 యూనిట్లను విక్రయించింది. అదే నెలలో కంపెనీ రిజిస్ట్రేషన్లు 19 శాతం పెరిగి 3,23,230 యూనిట్లకు చేరాయి.ఇక ఇతర ప్రధాన కంపెనీల విషయానికొస్తే, హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియ అమ్మకాలు 3 శాతం పెరిగి 5,05,000 యూనిట్లుగా నమోదు కాగా, టీవీఎస్ మోటార్ అమ్మకాలు 12 శాతం వృద్ధితో 4,13,000 యూనిట్లకు చేరాయి. బజాజ్ ఆటో 5 శాతం వృద్ధితో 2,73,000 యూనిట్లు, ఐషర్ మోటార్స్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు ఏకంగా 43 శాతం వృద్ధితో 1,13,000 యూనిట్లుగా నమోదయ్యాయి. సెప్టెంబర్ ఆరంభంలో శ్రాద్ధ పక్షం కారణంగా అమ్మకాలు కాస్త నెమ్మదించినా, పండగ సీజన్ మొదలవగానే ఒక్కసారిగా పుంజుకున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. "జీఎస్టీ తగ్గింపు, కొత్త మోడళ్ల విడుదల, పండగ ఆఫర్లు కలిసి వినియోగదారుల్లో కొనుగోలు సెంటిమెంట్‌ను బలంగా పెంచాయి" అని ఓ విశ్లేషకుడు పేర్కొన్నారు.యాక్సిస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం, గత నెలలో మొత్తం ఆటోమొబైల్ రంగంలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. టూవీలర్లు, త్రీవీలర్లు, వాణిజ్య వాహనాల అమ్మకాలు బలంగా పెరిగినప్పటికీ, ప్యాసింజర్ కార్ల విక్రయాలు మాత్రం గతేడాదితో పోలిస్తే తగ్గుముఖం పట్టాయి.

# ప్రయివేటు రంగ కార్యకలాపాలు క్షీణత



దేశంలో ప్రయివేటు రంగ కార్యకలాపాల్లో స్తబ్దత చోటు చేసుకుంటుంది. డిమాండ్ బలహీనంగా ఉండటం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వ్యాపార ఆశావాదంపై ప్రతికూల ప్రభావం చూపాయని హెచ్ఎస్‌బిసి తన ఫ్లాష్ ఇండియా కంపోజిట్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ)లో తెలిపింది. ఈ పరిణామాలతో అక్టోబర్‌లో పిఎంఐ 59.9 కి పడిపోయిందని ఇది ఐదు నెలల కనిష్ట స్థాయి అని వెల్లడించింది. ఇది రాయిటర్స్ పోల్ అంచనా 61.2 కంటే తక్కువ. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 61.0గా నమోదయ్యింది. మే నెల నుండి అత్యల్ప స్థాయి అయినప్పటికీ 50 మార్కు పైన ఉండటం వల్ల కొంత ఆశవాదం నెలకొంది. సేవల రంగంలో మందగించిన వృద్ధి ఈ క్షీణతకు ప్రధాన కారణం. అయితే తయారీ రంగం సెప్టెంబర్‌లో నాలుగు నెలల కనిష్ఠ స్థాయి నుండి కొంత కోలుకొంది. తయారీ పిఎంఐ 57.7 నుండి 58.4కి పెరగగా, సేవల వ్యాపార కార్యకలాపాల ఇండెక్స్ 60.9 నుండి 58.8కి పడిపోయింది. ఈ ఏడాది మే నెల నుండి కొత్త ఆర్డర్లు నెమ్మదించాయి. ట్రంప్ టారిఫ్‌ల అనంతరం సేవల రంగంలో ఉత్సాహం కోల్పోవడం దీనికి ప్రధాన కారణం. అయితే.. వస్తువుల ఉత్పత్తి సెప్టెంబర్ కంటే కొంచెం వేగంగా పెరుగుదలను నమోదు చేసింది. ప్రధానంగా తయారీ ఎగుమతులలో మందగింపునతో అంతర్జాతీయ డిమాండ్ ఏడు నెలల్లో అత్యంత బలహీనంగా నమోదయ్యింది. భారత ఎగుమతులపై అమెరికా అధిక సుంకాలను అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. రష్యన్ చమురు కొనుగోళ్లను ఇండియా ఆపకపోతే సుంకాలు మరింత ఎక్కువగానే ఉంటాయని అధ్యక్షుడు ట్రంప్ పదేపదే హెచ్చరిస్తోన్న విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమాచారం ప్రకారం.. సెప్టెంబర్‌లో యుఎస్‌కు ఎగుమతులు భారీగా తగ్గాయి. ఇది వరుసగా ఐదో నెల పతనం కావడం గమనార్హం. మరోవైపు సెప్టెంబర్‌లో జిఎస్‌టి తగ్గించడం వల్ల ఖర్చు ఒత్తిడి తగ్గినప్పటికీ, కంపెనీలు ఈ ప్రయోజనాలను ఖాతాదారులకు బదిలీ చేయకుండా, అధిక కార్యకలాపాల ఖర్చులను భర్తీ చేయడానికి విక్రయ ధరలను పెంచాయి.

# టీమిండియాతో టెస్టు సిరీస్‌కు సౌతాఫ్రికా జట్టు ప్రకటన



టీమిండియాతో టెస్టు సిరీస్ కు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు తమ జట్టును ప్రకటించింది. తమ కెప్టెన్ తెంబా బవుమా గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని.. భారత్‌లో సఫారీ జట్టుకు సారథ్యం వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు బవుమా కెప్టెన్సీలో టీమిండియాతో టెస్టులు ఆడబోయే జట్టులో పదిహేను మందికి చోటు ఇచ్చినట్లు సోమవారం వెల్లడించింది.

**భారత్‌తో రెండు టెస్టులు**

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌లో భాగంగా సౌతాఫ్రికా టీమిండియాతో రెండు టెస్టుల్లో తలపడనుంది. భారత్ వేదికగా జరిగే ఈ సిరీస్ నిర్వహణకు నవంబరు 14-26 వరకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన జట్టును ప్రొటిస్ బోర్డు తాజాగా ప్రకటించింది. ఇటీవల పాకిస్తాన్‌లో పర్యటించిన జట్టులో స్వల్ప మార్పులతోనే టీమిండియాతోనూ సఫారీలు బరిలో దిగనున్నారు. బవుమా తిరిగి రావడంతో డేవిడ్ బెడింగ్‌హామ్ జట్టులో చోటు కోల్పోయాడు. కాగా పాక్‌తో ఇటీవల సౌతాఫ్రికా జట్టు రెండు టెస్టులు ఆడింది.

**పాక్‌తో టెస్టు సిరీస్ సమం**

బవుమా గైర్హాజరీలో ఐడెన్ మార్క్రమ్ సారథ్యంలో డబ్ల్యూటీసీ డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలో దిగిన సౌతాఫ్రికా.. అనూహ్య రీతిలో పాక్‌తో తొలి టెస్టులో ఓడింది. ఆ తర్వాత రావల్పిండి వేదికగా రెండో టెస్టు గెలిచి సిరీస్‌ను 1-1 సమం చేయగలిగింది. తదుపరి పాక్‌తో మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడిన తర్వాత సౌతాఫ్రికా జట్టు భారత పర్యటనకు రానుంది. ఈ టూర్‌లో బాగంగా టీమిండియాతో తొలుత రెండు టెస్టులు ఆడనున్న సఫారీలు.. తదుపరి మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడనున్నారు.

**విండీస్‌ను వైట్‌వాష్ చేసిన టీమిండియా**

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న టీమిండియా వన్డే సిరీస్‌లో ఆతిథ్య జట్టు చేతిలో 2-1తో ఓటమి చవిచూసింది. తదుపరి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ పూర్తి చేసుకుని.. స్వదేశంలో సౌతాఫ్రికాతో తలపడనుంది. ఇక డబ్ల్యూటీసీ తాజా సీజన్‌లో గిల్ సేన తొలుత ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఆ తర్వాత స్వదేశంలో వెస్టిండీస్‌ను 2-0తో వైట్‌వాష్ చేసి జోరు మీదుంది.

**టీమిండియాతో టెస్టులకు సౌతాఫ్రికా జట్టు ఇదే**

తెంబా బవుమా (కెప్టెన్), ఐడెన్ మార్క్రమ్, రియాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైలీ వెరెన్నె, డెవాల్డ్ బ్రెవిస్, జుబేర్ హంజా, టోనీ డీ జోర్జి, కార్బిన్ బాష్, వియాన్ ముల్డర్, మార్కో యాన్సెన్, కేశవ్ మహరాజ్, సెనురాన్ ముత్తుస్వామి, కగిసో రబడ, సైమన్ హార్మర్.

## ఐసీయూ నుంచి వార్డుకు.. నిలకడగానే అయ్యర్ ఆరోగ్యం..!



సిడ్నీ వన్డేలో క్యాచ్ అందుకునే క్రమంలో గాయపడిన శ్రేయస్ అయ్యర్ కోలుకుంటున్నాడు. రెండు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్న అయ్యర్‌ను.. సోమవారం ఐసీయూ నుంచి స్పెషల్ వార్డుకు మార్చారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు చెప్పారు. అయితే.. అస్పత్రిలోనే మరో రెండు మూడు రోజులు ఉండాల్సి వస్తుందని తెలిపారు. వైస్ కెప్టెన్ అయిన అయ్యర్.. పూర్తిగా కోలుకునేందుకు మూడు వారాలకు పైగా సమయం పట్టనుందని సమాచారం. 'మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ.. క్యాచ్ అందుకుంటున్న సమయంలో అయ్యర్‌కు గాయమైంది. ఎడమవైపు పొత్తకడుపు కింది భాగంలో అతడి మోచేయి బలంగా తాకింది. దాంతో.. నొప్పితో విలవిల్లాడిన అతడిని ఫిజియో పరీక్షించారు. అయి నా అయ్యర్ ఇబ్బందిపడుతూనే ఉండడంతో ఆసల్యం చేయ కుండా ఆస్పత్రిలో చేర్పించారు. స్కానింగ్ పరీక్షల్లో అతడికి ప్లీహం భాగంలో గాయం అయినట్టు గుర్తించాం. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉంది. వేగంగా కోలుకుం టున్నాడు. బీసీసీఐ వైద్యబృందం అయ్యర్ ఆరోగ్యాన్ని అను క్షణం పర్యవేక్షిస్తోంది. అతడి ఆరోగ్యంలో రోజూవారీ పురో గతిని గమనించేందుకు టీమిండియా డాక్టర్ సిడ్నీలోనే ఉండ నున్నాడు' అని బీసీసీఐ ఒక ప్రకనటలో వెల్లడించింది. అంతే కాదు అయ్యర్‌కు అండగా కొందరు స్నేహితులు ఉన్నా రని.. వీసా ప్రక్రియ పూర్తికాగానే అతడి కుటుంబసభ్యులు కూడా సిడ్నీ చేరుకుంటారని బీసీసీఐ తెలిపింది. మూడో వన్డేలో హర్షిత్ రానా ఓవర్లో అలెక్స్ క్యారీ థర్డ్‌మ్యాన్ దిశలో కొట్టిన బంతిని అయ్యర్ డైవ్ చేస్తూ అందుకున్నాడు. సూపర్ క్యాచ్ పట్టిన అతడు.. ఆ తర్వాత ఎడమవైపు పక్కటెముల నొప్పితో విలవిల్లాడాడు. దాంతో, ఫీజియో వచ్చి పరీక్షిం చాడు.. అయినా ఉపశమనంగా లేకపోవడంతో అయ్యర్ బాధపడు తూనే డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. అతడికి స్కానింగ్ పరీక్షలు జరిపిన వైద్యులు.. పెద్ద ప్రమాదమేమీ లేదని తేల్చడంతో భారత మేనేజ్‌మెంట్, అభిమానులు ఊపిరిపీల్చు కున్నారు. నవంబర్ ఆఖర్లో దక్షిణాఫ్రికాతో జరుగబోయే మూడు వన్డేల సిరీస్ లోపు అయ్యర్ కోలుకునే అవకాశ ముంది. స్వదేశంలో నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6వ తేదీన సఫారీ టీమ్‌తో టీమిండియా తలపడనుంది

# స్పోర్ట్స్


## టీమిండియాకు భారీ షాక్.. ప్రపంచకప్ నుంచి ఓపెనర్ ప్రతీక ఔట్!




మహిళల వన్డే వరల్డ్ కప్‌ను పట్టేయాలనే కసితో ఉన్న భారత జట్టుకు భారీ షాక్. ఫామ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ ప్రతీకా రావల్ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ.. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో గాయపడిన తనకు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దాంతో.. కీలకమైన ఆస్ట్రేలియా మ్యాచ్‌కు ఆమె అందుబాటులో ఉంటుందని ఆశించిన హర్మన్‌ప్రీత్ సేనకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టైంది. అసలేం జరిగిందంటే..? డీవై పాటిల్ స్టేడియంలో ఆదివారం వర్షం అంతరాయంతో 27 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ కీలక వికెట్లు కోల్పోయింది. అయితే.. శోభన మోస్త్రే (26) కీలక ఇన్నింగ్స్ ఆడింది. రాధా యాదవ్ వేసిన 21వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన శోభన.. చివరి బంతిని మిడాఫ్‌లో బలంగా కొట్టింది. బౌండరీ వెళ్లకుండా బంతిని ఆపబోయిన ప్రతీక.. కొంచెం ముందుకు వెళ్లింది. తిరిగి వెనక్కి వచ్చే క్రమంలో ఆమె షూ స్పైక్స్ గడ్డిలో ఇరుక్కోవడంతో.. కిందపడిపోయింది. ఎడమ కాలిమడిమ మడతపడంతో నొప్పిని భరించలేకపోయింది ప్రతీక. నడవడానికి ఇబ్బంది పడిన ఆమెను సహచరులు డ్రెస్సింగ్ రూమ్‌కు తీసుకెళ్లారు. అయితే.. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసినా బ్యాటింగ్‌కు రాలేదు. దాంతో.. స్మృతిమంధానతో కలిసి అమన్‌జోత్ కౌర్ ఇన్నింగ్స్ ఆరంభించింది.

**మంధానతో పోటీగా**

వర్షం కారణంగా మ్యాచ్ రద్దయినా ప్రతీక ఆరోగ్యం గురించి బీసీసీఐగానీ, కోచ్ మజుందార్‌గానీ ఎలాంటి ప్రకటన చేయలేదు. దాంతో.. కీలకమైన సెమీస్ పోరులో ఆమె ఆడడంపై సోమవారం స్పష్టత వస్తుందని ఆశించారంతా. కానీ, భారత జట్టుకు, అభిమానులకు షాకిస్తూ..తను టోర్నీ నుంచి వైదొలిగింది. నిరుడు డిసెంబర్‌లో వన్డేల్లో అరంగేట్రం చేసిన ప్రతీక ఓపెనర్‌గా స్థిరపడిపోయింది. చాపకింద నీరులా ఇన్నింగ్స్ నిర్మించే తను.. ఆఖర్లో పవర్‌ఫుల్ షాట్లతో విరుచుకుపడుతూ వరల్డ్ కప్‌లో అదరగొట్టింది. స్మృతి మంధానతో కలిసి పోటీగా ఆడుతూ శుభారంభాలు ఇచ్చిన ప్రతీక.. మెగా టోర్నీలో ఆడిన ఆరు మ్యాచుల్లో ఒక శతకం, హాఫ్ సెంచరీలతో కలిపి 308 రన్స్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. లీగ్ దశలో విశాఖపట్టణంలో ఆస్ట్రేలియాపై అర్ధ శతకంతో చెలరేగిన ప్రతీక సెమీస్‌లోనూ చెలరేగిపోవాలని భావించింది. స్మృతి, తను దంచేస్తే టీమిండియాకు తిరుగుండదని అభిమానులు ఆశించారు. కానీ, లీగ్ దశ చివరి మ్యాచ్‌లో అనుకోని గాయం ప్రతీక తొలి వరల్డ్ కప్ ఆశలను ఆవిరి చేసేసేంది. ఇప్పుడు టేబుల్ టాపర్ ఆస్ట్రేలియాతో గురువారం సెమీఫైనల్ పోరులో మంధానకు జోడీగా ఇన్నింగ్స్ ఆరంభించేందుకు ఎవరిని పంపాలి? అనేది భారత కోచ్, కెప్టెన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. బంగ్లాపై ఫర్వాలేదనిపించిన అమన్‌జోత్‌నే కొనసాగించాలా? మరెవరినైనా పంపాలా? అనే విషయంపై గురువారంకల్లా స్పష్టత రానుంది.



# సూర్య-46 మూవీలోకి స్టార్ బ్యూటీ ఎంట్రీ

స్టార్ హీరో సూర్య, డైరెక్టర్ ఆర్.జే. బాలాజీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ మూవీ 'కరుప్పు'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఇక దీంతో పాటు తెలుగులో వెంకీ అట్లూరి దర్శకత్వంలో మరో మూవీ చేయబోతున్న విషయం తెలిసిందే. 'సూర్య-46'అనే వర్కింట్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది షూటింగ్ స్టార్ట్ కాబోతున్న ఈ చిత్రంలో తాజాగా ఓ స్టార్ బ్యూటీ కూడా యాడ్ అయినట్లు ఇచ్చారు మేకర్స్. ఇందులో రవీన్ టండన్ కూడా భాగం కాబోతున్నట్లు తెలుపుతూ.. 'ఎవర్ గ్రీన్ రవీన్ టండన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ాబతీఱఖ్యి46 లోకి మిమ్మల్ని చేర్చుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మీతో ముందు ముందు ఉండబోయే అద్భుతమైన ప్రయాణం కోసం వేచి చూస్తున్నాము' అని తెలిపారు.

# నయనతారకు మరో ఆఫర్!



నందమూరి బాలయ్య ఏడాదికి రెండు సినిమాలు చేసుకుంటూ ముందుకు దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అఖండ 2 సినిమాతో ఫుల్ బిజీగా ఉన్న నందమూరి బాలయ్య, మరో నెలలో కొత్త సినిమా ప్రారంభించనున్నారు.గోపీచంద్ మలినేనితో మరో సినిమా తీసేందుకు బాలయ్య సిద్ధమయ్యారు. 111 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా నవంబర్ ఏడో తేదీన పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకోబోతున్నట్లు టాక్. ఇప్పటికే బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో వీరసింహారెడ్డి సినిమా వచ్చి సక్సెస్ అయింది. దీంతో మరోసారి గోపీచంద్ కు ఛాన్స్ ఇచ్చాడు నందమూరి బాలయ్య. ఇక ఈసారి మాస్ యాక్షన్ అంశాలతో పాటు రెండు కాలాలకు సంబంధించిన హిస్టారికల్ కథను గోపీచంద్ మలినేని సిద్ధం చేశాడట. టైం ట్రావెల్ లాంటి కథ అని చెబుతున్నారు. ఇందులో కూడా నందమూరి బాలయ్య డబుల్ రోల్ లో కనిపించే ఛాన్సులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఈ సినిమా నుంచి మరో గాసిప్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ మూవీలో నయనతార హీరోయిన్ గా ఫైనల్ అయినట్లు చెబుతున్నారు. ఇప్పటికే బాలయ్యతో నయనతార చాలా అనే సినిమాలు తీశారు. హిస్టారికల్ కథ కావడంతో బాలయ్య సరసన నయనతార అయితేనే కరెక్ట్ గా ఉంటుందని గోపీచంద్ ఈ నిర్ణయం తీసుకున్నాడట. రెమ్యూనరేషన్ ఎంతైనా ఇచ్చేందుకు చిత్ర బృందం సిద్ధం అయిందని టాక్ వినిపిస్తోంది.



# పరిచయం నుంచి పరిణయం వరకు..

విష్ణు విశాల్ నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్, ట్రైలర్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మేకర్స్ 'పరిచయమే..' సాంగ్ రిలీజ్. జిబ్రాన్ ఈ సాంగ్‌ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. సామ్రాట్ అందించిన లిరిక్స్ అందర్నీ అలరిస్తున్నాయి. జిబ్రాన్, అభివి, భృత్త వోకల్స్ లవ్లీ ఫీల్‌ని యాడ్ చేశాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ జర్నీ హత్తుకునేలా ఉంది. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ 'ఎఫ్ఐఆర్' చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. 'ఆర్యన్' ఈనెల 31న విడుదల కానుంది.



# ఇంటిమేట్ సీన్స్.. అలాంటి రోల్స్‌కు నో

## ధన్య బాలకృష్ణన్

తెలుగులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా మాత్రమే కాదు.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పలు డిఫరెంట్ రోల్స్‌తో అభిమానులను మెప్పించింది. ప్రస్తుతం ధన్య హీరోయిన్‌గా కృష్ణ లీల అనే మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. దేవన్ హీరోగా వస్తోన్న ఈ మూవీ ట్రైలర్ రిలీజైంది. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన ధన్య బాలకృష్ణన్ తన కెరీర్, అవకాశాలపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన కెరీర్ ప్రారంభంలో చాలా ఫీలయ్యేదాన్ని ధన్య బాలకృష్ణన్ తెలిపింది. నేను తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల చాలా అవకాశాలు కోల్పోయానని పేర్కొంది. గ్లామరస్ రోల్స్‌కు నేను పెట్టుకున్న నిబంధనలే కారణమని తెలిపింది. ఇంటిమేట్ సీన్స్ చేయాల్సిన రోల్స్ ఉంటే కూడా నో చెప్పేదాన్ని అని వెల్లడించింది. ఒక మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి ఇండస్ట్రీలో ఈ స్థాయిలో ఉన్నానంటే చాలా గర్వంగా ఉందన్నారు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ నాకు హీరోయిన్ ఛాన్సులు వచ్చాయంటే నా సక్సెస్ కారణమన్నారు. నా ఫ్యామిలీని ఒప్పించి మరి ఇండస్ట్రీలోకి వచ్చానని ధన్య బాలకృష్ణన్ వెల్లడించారు. కాగా.. ధన్య బాలకృష్ణన్ తాజాగా నటించిన చిత్రం కృష్ణ లీల. దేవన్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తిరిగొచ్చిన కాలం.. అనేది ఈ మూవీకి ట్యాగ్‌లైన్. ఈ సినిమాను మహాసేన్ విజువల్స్ బ్యానర్‌లో జ్యోత్స్న నిర్మిస్తున్నారు.



# తొలి భారతీయ సూపర్ షీ సినిమా

"శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ 'కిల్లర్' అనే సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా కనిపించనున్న ఈ చిత్రంలో విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. ఆదివారం ఈ మూవీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశకు చేరుకుంటున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇండియా ఫస్ట్ సూపర్ షీ మూవీగా ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందుతోంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com